بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR**
Qadian

www.akhbarbadr.in

సంపాదకులు:
సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు:
ముహమ్మద్ అక్బర్

సంపుటి: **10**
సంచిక : **46**
వార్షిక చందా 600/-రూ॥

**13 నవంబర్ 2025 క్రీ, శ. 13 నబువ్వత్ ఇఖా 1404 హి, శ.**
**21 జమాదిఉల్ అవ్వల్ 1447 హి,ఖ.**


## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్యవంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను నమకూర్చు గాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

وَاَنۡفِقُوۡا فِیۡ سَبِیۡلِ اللّٰہِ وَلَا تُلۡقُوۡا
بِاَیۡدِیۡکُمۡ اِلَی التَّہۡلُکَۃِ ۚۖۛ وَاَحۡسِنُوۡا ۚۛ
اِنَّ اللّٰہَ یُحِبُّ الۡمُحۡسِنِیۡنَ ○
(سورۃ البقرۃ:196)

**అనువాదం:** అల్లాహు మార్గములో ఖర్చు చేయుము. చేతులారా వినాశనమును కోరి తెచ్చుకోకుము. మంచినే చేయుదు. నిశ్చయముగా ఉపకారం చేయువారిని అల్లాహ్ ప్రేమించును.

**(బఖరహ్:196)**

**ముసల్మానుడిగా జీవించడం సులువు కాదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల విధేయతను చూపడం, ఇస్లాం యొక్క ఆధర్శనం తమలో జనింపజేసుకోనంత వరకు సంతృప్తిగా ఉండకూడదు.**

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఉపదేశాలు:

### అత్యంత గొప్ప భాగ్యమును పొందునట్టి మార్గం:-

అత్యంత గొప్ప భాగ్యమును పొందడం కోసం అల్లాహ్ తాలా ఒకే మార్గమును నిర్దేశించాడు. అనగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల విధేయతను చూపడం. ఈ విషయాన్ని ఈ సూక్తిలో ఎంతో స్పష్టముగా తెలియజేశాడు. ఖుల్ ఇన్‌కున్‌తుమ్ తుహిబ్బూన ల్లాహ ఫత్తబిఊనీ యుహ్‌బిబ్‌కుం (ఆలే ఇమ్రాన్: 32) అనగా రండి నా మార్గమును అనుసరించండి. ఫలితముగా అల్లాహ్ కూడ మీకు మిత్రుడు అవుతాడు. అంటే కేవలం నామమాత్రముగా ప్రార్థనలు చేయమని దీని అర్థం కాదు. ఒకవేళ ధార్మిక వాస్తవ్యం ఇదే అయినచో మరి నమాజ్‌లు, ఉపవాసాలు ఏమిటి?. స్వయముగా ఒక పని నుండి ఆగిపోవడం, స్వయముగా ఒక పనిని చేయడం. కేవలం ఈ తరహ ఆచరణలే ఇస్లాం కాదు. ఇస్లాం అనగా మేక వలే తలను (అంకితం కోసం) సిద్ధంగా ఉంచడం. నా జీవితం, నా మరణం, నా నమాజ్‌లు, నా త్యాగాలు అన్ని అల్లాహ్‌కే అంకితం. కావున అందరి కంటే ముందుగా నేను నా తలను అర్పిస్తున్నాను అని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పినారు. ఈ అరుదైన గౌరవం అందరి కంటే ముందుగా ఇస్లాం స్థాపకులైన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు మాత్రమే దక్కినది. అంతేగాని ఇబ్రాహీం (అ)కు దక్కలేదు. మరే ఇతర ప్రవక్త (అ)లకు దక్కలేదు. ఈ వాక్యము కూడ ఈ విషయాన్ని గూర్చియే సూచిస్తుంది. **కున్‌తు నబియ్యన్ వ్వ ఆదము బయినల్ మాఇ వత్తీని.** నిజానికి వారు ప్రవక్తలందరి తరువాత అవతరించినప్పటికి వారు (స) ఇచ్చిన పిలుపు అనగా నా జీవితం, నా మరణం, అల్లాహ్‌తాలాకే అంకితం అని మరే ఇతర ప్రవక్త నోటి నుండి వెలువడలేదు.

### ముసల్మానుడి వాస్తవికత:-

నేడు ప్రపంచ పరిస్థితులను చూడండి!. మన ప్రియ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు తమ ఆచరణల ద్వారా నా జీవితం, నా మరణం అన్నియు అల్లాహ్‌కే అంకితం అని నిరూపించారు. నేడు ప్రపంచంలో ముసల్మానులు ఉన్నారు. ఎవరినైన నీవు ముసల్మానుడివా? అని అడిగినచో అల్ హందులిల్లాహ్ అని పలుకుతాడు. ఏ కలిమను అయితే పఠిస్తాడో, ఆ కలిమాను తీసుకవచ్చిన వారి జీవిత పరమార్థం అల్లాహ్‌ను పొందడం. కాని వీరు మాత్రం ప్రపంచం కోసం జీవిస్తారు. ప్రపంచం కోసం మరణిస్తారు. ఆఖరి క్షణాలు ఆవహించునంత వరకు ప్రపంచమే వారి లక్ష్యం, ఆకాంక్ష, అభిమానమై ఉంటుంది. అలాంటప్పుడు తాను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరిస్తున్నాని ఎలా చెప్పగలడు. ఇది చాలా ఆలోచించవలసిన విషయం. దానిని చూసిచూడనట్లుగా వదిలి వేయకూడదు. ముసల్మానుడిగా జీవించడం సులువు కాదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల విధేయతను చూపడం, ఇస్లాం యొక్క ఆధర్శనం తమలో జనింపజేసుకోనంత వరకు సంతృప్తిగా ఉండకూడదు.

ఇది కేవలం పొట్టు మాత్రమే. ఒకవేళ కేవలం అనుసరించకుండానే ముసల్మానుడిగా భావిస్తున్నచో కేవలం పేరు మరియు పొట్టును చూసి సంతోష పడడం వివేకుల లక్షణం కాదు. ఇలా లిఖించబడింది. ఒక యూదుడినితో ఒక ముసల్మానుడు నీవు ఇస్లాంను స్వీకరించుము అని అన్నాడు. అందుకు ఆ యూదుడు ఇలా అన్నాడు. నీవు కేవలం పేరు వలనే సంతోషపడకు. నేను నా కొడుకుకు ఖాలిద్ అని నామకరణం చేశాను. మరియు సాయంత్రం కాక ముందే నేను అతనిని సమాధి చేసి వచ్చాను. కావున వాస్తవికతను గ్రహించుము. కేవలం పేరుతోనే సంతోషపడకుము. మానవుడు తనకు తాను అత్యంత వైభవంతుడైన ప్రవక్త సమాజీకుడిగా ప్రచారం చేసుకుంటూ అవిశ్వాసుల వలే జీవితంను గడిపినచో ఇది ఎంతటి సిగ్గుచేటు. నీవు నీ జీవితంలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆదర్శంను కూడ చూపించుము. అట్టి స్థితినే ఏర్పర్చుకొనుము. ఒకవేళ నీవు ఆ స్థితిని కల్పించుకోలేక పోయినచో నీవు తాఘూత్ శిష్యుడవని భావించుకో.

ఈ విషయం ఇప్పుడు చాలా స్పష్టముగా అర్థమై ఉంటుది. అదేమనగా అల్లాహ్ ప్రీతిపాత్రుడిగా మారటమే మానవుడి జీవితపు ఆకాంక్ష, లక్షణం కావలెను. ఎందుకనగా అల్లాహ్‌కు ప్రీతి పాత్రుడు కానంత వరకు, అల్లాహ్ ప్రేమ లభించనంత వరకు సఫలీకృతమైన జీవితాన్ని గడుపలేరు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను స్వశ్ఛతతో అనుసరించ నంత వరకు, స్వచ్ఛమైన విధేయతను కనబర్చనంత వరకు ఈ స్థితి ఏర్పడదు. ఇస్లాం ఏమిటి? అనే విషయాన్ని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఆచరణల ద్వారా చూపించారు. కావున మీరు కూడ అట్టి ఇస్లాంను మీలో జనింప జేసుకొనుడు. ఫలితముగా మీరు కూడ దేవుని ప్రీతిపాత్రులకు అర్హులగుదురు. **(మల్ఫూజాత్ సంపుటి 2, పేజి 69-70, ఎడిషన్ 2018 ఖాదియాన్)**

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

■ హజ్రత్ ఆయిషా రజియల్లాహు తాలా అన్‌హా ఇలా ఇలా ఉల్లేఖించారు. అఫల్హా నాతో ఇంటిలోకి రావడానికి అనుమతిని అడిగారు. నేను అందుకు అనుమతించ లేదు. వారు ఇలా అన్నారు. నాతో పరదా పాటిస్తున్నావా?. నిజానికి నేను మీ పిన్నాన్నను . అందుకు నేను మీరు ఎలా నా పిన్నాన్నా ? అని ప్రశ్నించాను. అందుకు వారు ఇలా అన్నారు. మా వదినా మీకు పాలు త్రాపించినది. అందుకు నేను ఈ విషయాన్ని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలియ జేశాను. ప్రవక్త (స) ఇలా అన్నారు. అఫత్హా సత్యం పలికాడు. అతనికి ఇంటికిలోకి రావడానికి అనుమతించుము.

■ హజ్రత్ ఇబ్నే అబ్బాస్ రజియల్లాహు అన్‌హుమా ఇలా ఉల్లేఖించారు. వారు ఇలా తెలిపారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు హజ్రత్ హంజా రజి గారి కుమార్తెను గూర్చి ఇలా తెలిపారు. ఆమే నా కోసం అనుమతించ బడదు. ఏ బంధువుత్వం వంశపరముగా అనుమతించబడదో, ఆ బంధుత్వం పాలు త్రాగించిన అనుబంధం వలన కూడ అనుమతించబడదు. కావున ఆమే పాల బంధుత్వం ప్రకారం నా సోదరుడి కూతురు అవుతుంది.

ఈ సంచికలో ...


**(1) 16 మే 2025 నాటి జుమా ప్రసంగం ........ పేజి 2లో.**


### 130 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 130 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 26,27,28 డిశంబర్ 2025 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక! **(నాజిర్ ఇస్లాహ్ విర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్)**


జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

ఈ రోజు కూడ నేను మరొక యుద్ధంను గూర్చి ప్రస్తావించెదను. మక్కా విజయం కంటే ముందు ఈ యుద్ధాలు జరిగినట్లు నా వద్ద సంబంధిత అంశాలు ఉన్నాయి. ఇది సంక్షిప్తముగా ఉన్నది. దీని తరువాత మరొక అంశంను గూర్చి ప్రస్తావించెదను. అబూ ఖతాదహ్ అన్సారీ రజి యుద్ధంను గూర్చిన ప్రస్తావన గలదు. ఖజిరా ప్రాంతీయులతో హి॥జ్రి 8వ సం॥ షఅబాన్ మాసంలో చోటు చేసుకుంది. ఈ యుద్ధానికి సైనాధిపతిగా అబూఖతాదహ్ రజి కొనసాగారు.

---

దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మమ్ము నజద్ భూభాగంలో నివాసం ఉంటున్న బనూ ఘత్ఫాన్ తెగ వారి వైపు పంపారు. అంతేగాకుండా రాత్రివేళ ప్రయాణించండి, పగలు దాక్కొండి, అకస్మత్తుగా దాడి చేయండి, మహిళలను, పిల్లలను హత్య చేయకూడదు అని సూచించారు. మొత్తానికి మేము బయలుదేరినాము, చివరికి ఘత్ఫాన్ తెగవారి సమీపంనకు చేరుకున్నాము.

---

ఒక కథనము ప్రకారం అనుచరులు ఈ యుద్ధం కోసం 15 రోజులు బయట ఉన్నారని గలదు. 200ల ఒంటెలు, 1000 మేకలు, అనేక మంది ఖైదీలను తీసుకవచ్చారు. 5వ భాగం వేరుచేసిన తరువాత ప్రతి ఒక్కరికి 12 ఒంటెలు సంపదగా వచ్చాయి. ఒక ఒంటెకు సమానంగా 10 మేకలను భాగంగా నిర్ణయించడం జరిగింది. మరొక కథనము ప్రకారం ఈ యుద్ధంలో 200ల ఒంటెలు, 2000ల మేకలు చాలా మంది ఖైదీలు పట్టుబడినట్లు గలదు.

---

మరల ఇజమ్‌లోయ ప్రాంతం వైపు పంపబడిన హ॥జ్రత్ అబూ ఖతాదహ్ రజి గారి మరొక ప్రతిఘటన ప్రస్తావన గలదు. ఈ ప్రతిఘటన హి॥జ్రి 8వ సంవత్సరం రమజాన్ మాసంలో అనగా జనవరి 630వ సం॥లో జరిగింది. ఈ ఇజమ్ మదీనా నుండి 36 మైళ్ళ దూరంలో తూర్పు దిశలో ఉన్నటు వంటి నజద్ ప్రాంతపు ఒక లోతట్టు ప్రాంతం. ఇక్కడ ఘత్ఫాన్ తెగకు చెందిన మరొక ఉప తెగ బనూ అష్జ ప్రజలు నివాసం ఉండేవారు.

---

ప్రస్తుతం జమాఅత్‌కు చెందిన ఒక మహోన్నతుడు, ధార్మిక పండితుడు. ఖిలాఫత్ పట్ల అంకిత భావం గల, అసాధారణ ధార్మిక సేవా దృక్పథం కల్గిన వ్యక్తిని గూర్చి ప్రస్తావించాలనుకుంటున్నాను. వారు కొన్ని రోజుల క్రితమే మృతి చెందారు. అదే విధముగా ఒక స్వచ్ఛమైన, అంకిత భావం కల్గిన అహ్మదియ్యా మిత్రుడు ప్రస్తుతం దైవ మార్గంలో ఖైదిగా ఉంటూ మరణించాడు. వీరు అమరులు. అక్కడి పరిస్థితుల ద్వారా వారు అమరులనే విషయమే స్పష్టమవుతుంది.

---

మొదటి ప్రస్తావన గౌ॥ సయ్యద్ మీర్ ముహమూద్ అహ్మద్ నాసిర్ గారిది. వీరు హ॥జ్రత్ సయ్యద్ మీర్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ సాహెబ్ రజియల్లాహు తాలా అన్‌హు గారి కుమారుడు. కొన్ని రోజుల క్రితం వీరు 96 సంవత్సరాల వయస్సులో మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజీవూన్.

---

సిహా సిత్తా పూర్తిగా ఉర్దూ అనువాదం చేసిన తరువాత మస్నద్ అహ్మద్ బిన్ హంబల్ అనువాదం కొనసాగుతుంది. అదే విధముగా సహీ ముస్లిం విశ్లేషణల పర్వం కూడ కొనసాగుతుంది. షమాయిలే తిర్మిజి అనువాదం కూడ వారే చేశారు. బైబిల్ ను గూర్చి రెండు పదుల సంఖ్యలో విజ్ఞాన వ్యాసాలను వ్రాసారు.

---

రెండవ ప్రస్తావన నేను ముందుగా తెల్పినట్లుగా ఒక అహ్మదీయ మిత్రునిది. వారు కొన్ని రోజుల క్రితం ఖైదీలో ఉండగా మృతి చెందారు. వారి పేరు డాక్టర్ తాహిర్ మహ్‌మూద్ సాహెబ్. వీరు గులాం రసూలు సాహెబ్ కరాచి గారి కుమారుడు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హ॥జ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 16 మే 2025, ( 16 హిజ్రత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

ఈ రోజు కూడ నేను మరొక యుద్ధంను గూర్చి ప్రస్తావించెదను. మక్కా విజయం కంటే ముందు ఈ యుద్ధాలు జరిగినట్లు నా వద్ద సంబంధిత అంశాలు ఉన్నాయి. ఇది సంక్షిప్తముగా ఉన్నది. దీని తరువాత మరొక అంశంను గూర్చి ప్రస్తావించెదను. అబూ ఖతాదహ్ అన్సారీ రజి యుద్ధంను గూర్చిన ప్రస్తావన గలదు. ఖజిరా ప్రాంతీయులతో హి॥జ్రి 8వ సం॥ షఅబాన్ మాసంలో చోటు చేసుకుంది. ఈ యుద్ధానికి సైనాధిపతిగా అబూఖతాదహ్ రజి కొనసాగారు. ఖజిరా ప్రాంతం మదీనా నగరానికి తూర్పు దిక్కున ఉన్నటు వంటి బనూ ముహారిబ్ ప్రాంతంలో భాగంగా పరిగణించబడుతుంది. అంతేగాకుండా నజద్‌లో అంతర్లీనమైన తిహామ ప్రాంతంలో భాగంగా కూడ పరిగణించేదేది. ఈ ప్రాంతంలో బనూ ఘత్ఫాన్‌కు చెందిన ఒక శాఖ నివాసం ఉండేది. బనూ ఘత్ఫాన్ తెగ వారు నిరంతరం ఇస్లాంకు వ్యతిరేకముగా వ్యవహరించేవారు. ముసల్మానులకు నష్టం కల్గించే ఏ చిన్న అవకాశాన్ని కూడ చేజార్చుకునేవారు కాదు. నజద్ భూభాగములోని ఖజీర ప్రాంతంలో నివాసం ఉంటున్న ఈ బనూ ఘత్ఫాన్ తెగవారు మదీనాకు వ్యతిరేకముగా రెచ్చగొట్టు కార్యక్రమాలను నిర్వహించడంలో నిమగ్నమై ఉండేవారు. **(ఘజ్వా వ సరాయ ముహమ్మద్ అజహర్ ఫరీద్ షా పేజి 438, ఫరీదియ పబ్లిషర్స్ సాహివాల్)**

హ॥జ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబీ హద్‌రద్ అస్లమీ రజి గారు ఇలా ఉల్లేఖించారు. నేను హ॥జ్రత్ సురాఖ బిన్ హారిస్ రజి కుమార్తెను వివాహం చేసుకున్నాను. వీరు బదర్ యుద్ధంలో వీరమరణం పొందారు. నాకు ప్రపంచంలో లభించిన వాటి అన్నియు వారి స్థాయి కంటే నాకు ఎక్కువ ప్రియమైనవి కావు. నేను వారి మెహర్ గా 200ల దిర్హములను నిర్ణయించాను. కాని వారికి ఇవ్వడానికి నా వద్ద ఏమియు లేకుండెను. అప్పుడు నేను ఆ మెహర్‌కు చెందిన నగదును అల్లాహ్ మరియు అతని ప్రవక్త (స)లు చెల్లింపజేయిస్తారని భావించాను. కావున నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకున్నాను. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో ఈ విషయాన్ని గూర్చి మాట్లాడినాను. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నీవు ఎంత మెహర్‌ను నిర్ణయించావు? అని నన్ను అడిగారు. అందుకు నేను 200 దిర్హములు. కావున ఓ అల్లాహ్ ప్రవక్తా! మెహర్ చెల్లించు విషయంలో మీరు నాకు సహాయం చేయండి అని విన్నవించుకున్నాను. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నేను నీకు సహాయం అందించడానికి ప్రస్తుతం నా వద్ద ఏమియు లేదు.కాని నేను అబుఖతాదహ్ రజిను కొంత మంది అనుచరులతో కలిపి ఒక యుద్ధానికి పంపుచున్నాను. నీవు కూడ వారితో వెళ్ళాలనుకుంటున్నావా?. ఫలితముగా అల్లాహ్ తాలా నీ భార్య మెహర్ చెల్లించుటకు నీకు యుద్ధ సంపద ద్వారా సహాయ పడగలడు అని అన్నారు. అందుకు నేను సరే అని సమాధానం ఇచ్చాను. ఆ తరువాత మేము బయలుదేరినాము. మొత్తానికి మేము 16 మందిమి. హ॥జ్రత్ అబూఖతాదహ్ రజి మాకు సేనాధిపతిగా ఉన్నారు. దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మమ్ము నజద్ భూభాగంలో నివాసం ఉంటున్న బనూ ఘత్ఫాన్ తెగ వారి వైపు పంపారు. అంతేగాకుండా రాత్రివేళ ప్రయాణించండి, పగలు దాక్కొండి, అకస్మత్తుగా దాడి చేయండి, మహిళలను, పిల్లలను హత్య చేయకూడదు అని సూచించారు. మొత్తానికి మేము బయలుదేరినాము, చివరికి ఘత్ఫాన్ తెగవారి సమీపంనకు చేరుకున్నాము.

**(కితాబుల్ ముఘాజి, సంపుటి 2, పేజి 224, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

చీకటి పడగానే అబూ ఖతాదహ్ రజి మమ్ములను ఉద్దేశించి ఇలా ప్రసంగించారు. అల్లాహ్‌కు భయపడండి. ఆపై ఇద్దరు వ్యక్తులతో కూడిన జంటలను ఏర్పాటు చేశారు. ఎవరు కూడ తన మిత్రుడిని వీడకూడ దన్నారు. వీరమరణం పొందడమా? లేదా విజయపు వార్తను తీసుకరావడమా జరగాలి. నేను అడిగినప్పుడు నాకు నా మిత్రుడిని గూర్చి తెలియదు అని సమాధానం ఇచ్చే స్థితిలో ఎవరు నా వద్దకు రాకూడదు. తప్పకుండా తోడుగానే ఉండాలి. ఎప్పుడు తక్బీర్‌లు పలికినా మీరు కూడ తక్బీర్‌లు పలకండి. నేను దాడి చేసినప్పుడు మీరు కూడ దాడి చేయండి. వెంబడిస్తూ చాలా దూరం వెళ్ళకూడదు. శత్రువు భయపడి పారిపోతున్నప్పుడు అతిగా వెంబడించవద్దు. శత్రువును పారిపోనివ్వండి. ఆ తరువాత మేము అక్కడ ఉన్నటు వంటి శత్రువులను ముట్టడించాము. హజ్రత్ అబూఖతాదహ్ రజి తమ ఖడ్గాన్ని ఒరలో నుండి బయటికి తీశారు. ఆపై తక్బీర్ పలికారు. మేముకూడ మా ఖడ్గాలను ఒరలో నుండి బయటికి తీసి, తక్బీర్‌లు పలికాము. ఆ తరువాత అందరం కలిసి అక్కడ ఉన్నటు వంటి శత్రువులపై దాడి చేశాము. **(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 6, పేజి 185–186, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ లిబ్నాన్ 1993)**

మరల ఇలా తెలిపారు. ఒక్కసారిగా నాకు కనిపించిన దృశ్యమేమనగా, ఒక పొడువైన వ్యక్తి తన ఖడ్గాన్ని చేత పట్టుకొని నెమ్మది నెమ్మదిగా నడుస్తున్నాడు. ఓ ముసల్మానులారా! స్వర్గము వైపుకు రండి. అని పిలుపునిస్తున్నాడు. నేను అతనిని అనుసరించాను. అతడు అవిశ్వాసుడు. హేళన చేస్తూ మీకు స్వర్గం కావాలి కదా! అయితే స్వర్గం వైపు రండి అని పలుకసాగాడు. అతడు స్వర్గం స్వర్గం అని పలుకుతూ మమ్ములను హేళన చేయసాగాడు. అతడు తిరిగి వస్తాడని నేను భావించాను. కావున అతని వెనకాలే నేను కూడ వెళ్ళాను. నా మిత్రుడు నీవు దూరం వెళ్ళకు, మన నాయకుడు మనలను అలా వెంబడించకూడదని హెచ్చరించాడు కదా! అని నిలువరించసాగాడు. మొత్తానికి ఇలా అన్నాడు. నేను అతని సమీపంనకు చేరుకోని నగ్నమగా ఉన్నటు వంటి అతని నడుముపై బాణమును విసిరాను. అయినా కూడ అతడు ఓ ముసల్మానులారా! స్వర్గం వద్దకు రండి అని అపహాస్యముగా పిలువసాగాడు. అప్పుడు నేను మరొక బాణం వేశాను. ఫలితముగా అతడు మరణించాడు. నేను అతని ఖడ్గాన్ని తీసుకున్నాను. నా మిత్రుడు నీవు ఎక్కడి వెళ్ళావు?, అల్లాహ్ ప్రమాణం! నేను అబూ ఖతాదహ్ రజి వద్దకు చేరుకున్నాను. వారు నీ గురించి నన్ను అడిగారు అని అన్నాడు. అందుకు నేను మన నాయకుడు నన్ను అడిగాడా? అని ప్రశ్నించాను. అప్పుడు అతడు అవును, వారు నాపై మరియు నీపై కోపంగా ఉన్నారు అని సమాధానం ఇచ్చాడు. అంతేగాకుండా ముసల్మానులు శత్రువులను హతమార్చినారని, యుద్ధ సంపదను ప్రోగు చేశారని కూడ అతడు చెప్పాడు. అందువలన నేను హజ్రత్ అబూ ఖతాదహ్ రజి వద్దకు చేరుకోగా, వారు నన్ను మందలించారు. అందుకు నేను " నేను ఒక వ్యక్తిని హతమార్చినాను. అతని వ్యవహారం ఈ విధముగా, ఆ విధముగా ఉండెను" అని తెలియజేశాను. ఆ తరువాత మేము పశువులను తోలుకోని, మహిళ ఖైదీలను వెంటతీసుకొని బయలుదేరినాము. మా ఖడ్గాలను మా ఆంభారీలకు వ్రేలాడదీశాము. ఉదయం వేళ చూడగా మా ఒంటెల నుండి రక్తం కారసాగింది. ఒక మహిళ జింక వలె పదే పదే వెనుకకు తిరిగి చూస్తూ, బోరున ఏడ్వసాగింది. అందుకు నేను ఆ మహిళను " ఎవరిని చూస్తున్నావు?" అని అడిగాను. అప్పుడు ఆ మహిళ " దేవుని ప్రమాణం! నేను ఒక వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నాను. ఒకవేళ అతడు ప్రాణాలతో ఉన్నట్లయితే అతడు మమ్ములను మీ నుండి కాపాడుతాడు " అని అన్నది. నా మనస్సులో బహుశా ఈ మహిళ నేను చంపిన వ్యక్తి కోసమే ఎదురు చూస్తున్నదని అనుకున్నాను. పైగా అంభారీకి వ్రేలాడదీసిన ఖడ్గము కూడ ఆ వ్యక్తికి చెందినదే. ఆమే మరల ఇలా అన్నది. "దేవుని ప్రమాణం! నా వద్ద అతని ఖడ్గపు ఒర ఉన్నది." ఆమే వద్ద ఆ వ్యక్తికి చెందిన ఖడ్గపు ఒర ఉన్నది. " నీవు నిజము చెబుతున్నచో ఆ ఖడ్గాన్ని ఈ ఒరలోకి చేర్చుము అని అన్నది. నేను చేర్చి చూడగా ఆ ఖడ్గమునకు సరిగ్గా అది సరిపోయింది. అప్పుడు ఆ మహిళ ఇంకా ఎక్కువగా ఏడ్చింది. మొత్తానికి మేము దైవ ప్రవక్త సన్నిదికి ఒంటెలను, మేకలను తీసుకోని వచ్చాము. **(కితాబుల్ ముఘాజి, సంపుటి 2, పేజి 224–225, దారుల్‌కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

ఒక కథనము ప్రకారం అనుచరులు ఈ యుద్ధం కోసం 15 రోజులు బయట ఉన్నారని గలదు. 200ల ఒంటెలు, 1000 మేకలు, అనేక మంది ఖైదీలను తీసుకవచ్చారు. 5వ భాగం వేరుచేసిన తరువాత ప్రతి ఒక్కరికి 12 ఒంటెలు సంపదగా వచ్చాయి. **(సుబూలుల్ హుదా వర్రిషాద్, సంపుటి 6, పేజి 187, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్ లిబ్నాన్)**

ఒక ఒంటెకు సమానంగా 10 మేకలను భాగంగా నిర్ణయించడం జరిగింది. మరొక కథనము ప్రకారం ఈ యుద్ధంలో 200ల ఒంటెలు, 2000ల మేకలు చాలా మంది ఖైదీలు పట్టుబడినట్లు గలదు. **(సీరతుల్ హలబియ్యా, సంపుటి 3, పేజి 273, దారుల్‌కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)(అత్తబ్ఖాతుల్ కుబ్రా, సంపుటి 2, పేజి 101, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

మరల ఇజమ్‌లోయ ప్రాంతం వైపు పంపబడిన హజ్రత్ అబూ ఖతాదహ్ రజి గారి మరొక ప్రతిఘటన ప్రస్తావన గలదు. ఈ ప్రతిఘటన హిజ్రి 8వ సంవత్సరం రమజాన్ మాసంలో అనగా జనవరి 630వ సం॥లో జరిగింది. ఈ ఇజమ్ మదీనా నుండి 36 మైళ్ళ దూరంలో తూర్పు దిశలో ఉన్నటు వంటి నజద్ ప్రాంతపు ఒక లోతట్టు ప్రాంతం. ఇక్కడ ఘత్ఫాన్ తెగకు చెందిన మరొక ఉప తెగ బనూ అష్జ ప్రజలు నివాసం ఉండేవారు.

ఈ ప్రతిఘటనకు గల కారణం ఏమిటనగా, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాను జయించుటకు బయలుదేరుటకు నిశ్చయించుకున్నప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా వైపు కాకుండా ఇజమ్ వైపు యుద్ధానికి బయలు దేరుతున్నారని ప్రజలు భావించుటకు మదీనాకు తూర్పు దిశలో ఉన్నటు వంటి ఇజమ్ లోయ ప్రజల వైపు హజ్రత్ అబూ ఖతాదహ్ రజిను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పంపారు. నిజానికి మక్కా దక్షణం వైపు ఉన్నది. మరొక కథనము ప్రకారం ఈ బృంధానికి హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ హద్‌రద్ నాయకత్వం వహించారని గలదు. హజ్రత్ అబూ ఖతాదహ్ రజికు తోడుగా 8 మంది అనుచరులు ఉన్నారు. వారిలో ఒకరు ముహల్లిమ్ బిన్ జస్సామ లైసీ రజి. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉబై హద్‌రద్ రజి ఇలా పేర్కొన్నారు. మేము ఇజమ్ లోతట్టు ప్రాంతానికి చేరుకున్నప్పుడు అక్కడ ఆమిర్ బిన్ అజ్‌బత్ అష్జఅ మా ముందు నుండి వెళ్ళిపోయాడు. ఆ వ్యక్తి వారి సమీపంనకు చేరుకోని ఇస్లామీయ పద్దతిలో సలాంలు తెలిపాడు. అందువలన ముసల్మానులు అతనిపై దాడి చేయుటకు వెనకాడారు. ఎందుకనగా అతడు ఇస్లామీయ పద్దతిలో సలాం చెప్పాడు. అందుకే బోధనల ప్రకారం వారిని ఏమి అనలేదు. కాని హజ్రత్ ముహల్లిమ్ రజికు ఆ వ్యక్తితో గతంలో ఏదో తగాద ఉండెను. అందువలన అతడు ఆమిర్ బిన్ అజ్‌బత్‌పై దాడి చేసి అతనిని హతమార్చినాడు. అంతేగాకా అతని సామాగ్రిని, ఒంటెను స్వాదీన పర్చుకున్నాడు. ఈ ఒక్క ఘటన కాకుండా మరెలాంటి వ్యక్తులతో అనుచరులకు ఎలాంటి పోరాటం జరుగలేదు. ఎందుకనగా కేవలం అన్యారాధుల దృష్టి మరల్చుటకు మాత్రమే వారిని పంపడం జరిగింది. అందువలన అనుచరులు అక్కడి నుండి తిరిగి వచ్చారు. ఆ సమయంలోనే వారికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా వైపు బయలుదేరిన సమాచారం అందింది. కావున వీరు కూడ మక్కావైపు బయలుదేరినారు. చివరికి మార్గ మధ్యలో వీరు కూడ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను చేరుకున్నారు. వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకున్న తరువాత వారు అక్కడ జరిగిన హత్యకు చెందిన పూర్తి వివరాలను ప్రవక్త (స)కు తెలియపరిచారు. ఆ సమయంలోనే ఈ క్రింది సూక్తి అవతరించింది. అని చరిత్ర గ్రంథాలలో లిఖించ బడింది. **యా అయ్యుహల్లజీన ఆమనూ ఇజా జరబ్‌తుమ్ ఫీ సబీలిల్లాహి ఫతబయ్యనూ వలా తఖూలూ లిమన్ అల్‌ఖా ఇలైకుముస్సలామ లస్‌త మూమినన్ తబ్‌తఘూన అరజల్ హయాతిద్దునియా ఫఇందల్లాహి మఘానిము కసీరతున్ కజాలిక కున్‌తుమ్ మ్మిన్ ఖబ్‌లు ఫమన్నల్లాహు అలైకుం ఫతబయ్యనూ ఇన్నల్లాహ కాన బిమా తఅమలూన ఖబీర** (నిసా: 95)

అనగా: ఓ విశ్వాసులారా! మీరు అల్లాహ్ మార్గమునందు పయనించు నప్పుడు సముచితమైన పరిశీలనము చేసుకొనుడు. శాంతిని ఆశించి మీకు నమస్కరించు వారితో నీవు విశ్వాసివి కావు అనకుడు. మీరు ప్రపంచ జీవితపు వస్తువులను ఆశించినచో అల్లాహ్ వద్ద యుద్ధములలో దొరికన వస్తువులు అనంతముగా వున్నవి. ఇంతకు ముందు మీరు కూడ ఈ విధముగానే యుండిరి. తరువాత అల్లాహ్ మిమ్ములను అనుగ్రహించెను. కనుక సముచితమైన పరిశీలన చేయుడు. నిశ్చయముగా మీరేమి చేయుదురో అల్లాహ్‌కు బాగుగా తెలుసును.

అనగా సలాంలు తెల్పిన వారితో ఏ విధముగాను పోరాడకూడదని, వారితో కఠినముగా వ్యవహరించకూడదని, వారిని హత్య చేయకూడదని, వారిని శిక్షించ కూడదని ఇందులో తెల్పడం జరిగింది.

ముందుగా తెల్పినట్లుగా ఈ యద్ధం హిజ్రి 8వ సంవత్సరంలో జరిగింది. కాని ఈ సూక్తి విషయానికి వచ్చినచో కథనాలు మరియు ఇబ్నే కసీర్ కు చెందిన చారిత్రక గ్రంథాలలో ఈ నిసా అధ్యాయము హిజ్రి 3వ సంవత్సరం మరియు 5వ సంవత్సరం మధ్య కాలంలో అవతరించినదని ఏకాభిప్రాయంను కల్గియున్నారు.

**(ప్రాంగ్ సీరత్, పేజి 45, జావార్ అకాడమీ)(సీరత్ ఇన్‌సైక్లోపీడియా సంపుటి 9, పేజి 111 దారుస్సలాం)(సీరత్ ఇబ్నే కసీర్ భాగం 3, పేజి 423)( అనువాదం ఖుర్‌ఆన్ కరీం హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మ పేజి 123)**

బహుశా ఈ ఘటనను గూర్చి విన్న తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ సూక్తిని పఠించి విచారంను వ్యక్తపర్చి ఉండవచ్చును. మొత్తానికి ప్రవక్త (స) ఈ సూక్తి ద్వారా వారిని ఇలాంటి ఘటనలకు పాల్పడకుండా అడ్డుకున్నారు.

ఈ ప్రస్తావన తరువాత ఇన్షా అల్లాహ్ మక్కా విజయపు ప్రస్తావన కొనసాగుతుందని ఆశిస్తున్నాను.

ప్రస్తుతం జమాఅత్‌కు చెందిన ఒక మహోన్నతుడు, ధార్మిక పండితుడు. ఖిలాఫత్ పట్ల అంకిత భావం గల, అసాధారణ ధార్మిక సేవా దృక్పథం కల్గిన వ్యక్తిని గూర్చి ప్రస్తావించాలనుకుంటున్నాను. వారు కొన్ని రోజుల క్రితమే మృతి చెందారు. అదే విధముగా ఒక స్వచ్ఛమైన, అంకిత భావం కల్గిన అహ్మదియ్య మిత్రుడు ప్రస్తుతం దైవ మార్గంలో ఖైదిగా ఉంటూ మరణించాడు. వీరు అమరులు. అక్కడి పరిస్థితుల ద్వారా వారు అమరులనే విషయమే స్పష్టమవుతుంది.

మొదటి ప్రస్తావన గౌ॥ సయ్యద్ మీర్ ముహమూద్ అహ్మద్ నాసిర్ గారిది. వీరు హజ్రత్ సయ్యద్ మీర్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ సాహెబ్ రజియల్లాహు తాలా అన్‌హు గారి కుమారుడు. కొన్ని రోజుల క్రితం వీరు 96 సంవత్సరాల వయస్సులో మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజీవూన్.

వీరు హజ్రత్ అమ్మాజాన్ హజ్రత్ నుస్రత్ జహాఁ బేగం సాహిబా రజియల్లాహు తాలా అన్‌హా గారి సోదరుడి కుమారుడు. మరియు హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి మరియు హజ్రత్ మరియం సిద్దీఖా సాహెబా గార్ల అల్లుడు. ముందుగా తెల్పినట్లుగా వీరు హజ్రత్ మీర్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ సాహెబ్ రజి గారి కుమారుడు. వీరి తల్లి గారి పేరు స్వాలిహా భేగం. వీరు హజ్రత్ మీర్ నాసిర్ నవాబ్ సాహెబ్ రజి గారి మనమడు. వీరి తల్లి (స్వాలిహా) గారు హజ్రత్ పీర్ మన్జూర్ మహ్‌మూద్ రజి గారి కుమార్తె. హజ్రత్ పీర్ మన్జూర్ మహ్‌మూద్ గారు హజ్రత్ సూఫీ అహ్మద్ జాన్ సాహెబ్ లుధియాన్వి గారి కుమారుడు. మృతుడు సయ్యద్ మహ్‌మూద్ అహ్మద్ గారి ప్రాథమిక విద్య ఖాదియాన్‌లో కొనసాగింది. ఆ తరువాత పంజాబ్ యూనివర్సిటి నుండి బి.ఏ పూర్తి చేశారు. మార్చి 1994లో తన తండ్రి హజ్రత్ సయ్యద్ మీర్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ సాహెబ్ రజి గారు మృతి చెందిన రోజున వీరు తమ జీవితాన్ని అంకితం చేశారు. మృతుడి కుమారుడు ముహమ్మద్ అహ్మద్ కూడ ఈ విషయాన్ని గూర్చి వ్రాసాడు. 17 మార్చి చాలా ప్రాముఖ్యతను కల్గిన రోజు అని పదే పదే చెబుతుండేవారు. అయితే మీ దృష్టిలో ఆ రోజుకు అంతటి ప్రాధాన్యత ఎందుకు ఉన్నది? అని మృతుడి కుమారుడు మృతుడిని ప్రశ్నించగా వారు ఇలా సమాధానం ఇచ్చారు. ఆ రోజున నా తండ్రి గారు మృతి చెందారు. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు గారు ఆ రోజు మొత్తం మా ఇంట్లోనే ఉన్నారు. నమాజ్‌లు కూడ అక్కడే చదివించారు. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి ఆ సమయంలో అక్కడ ఒక చిన్న ఉపన్యాసం చేశారు. అందులో మీర్ సాహెబ్ గారి ధార్మిక సేవలను గూర్చి, వారి అంకిత భావను గూర్చి, వారి నడవడికను గూర్చి మొ॥ విషయాలను ప్రస్తావించారు. మీర్ మహ్‌మూద్ అహ్మద్ గారు ఇలా తెలిపారు. ఆ ప్రస్తావనను విన్న తరువాత నేను లేచి నిలబడి, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజితో " హుజూర్ నేను జీవితాన్ని అంకితం చేస్తాను " అని విన్నవించుకున్నాను. అందుకు హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు గారు చాలా భావోద్రేకానికి గురైనారు. హుజూర్ రజి వారిని ఆప్యాయతతో హత్తుకున్నారు. ఆ సమయంలో సయ్యద్ మీర్ మహ్‌మూద్ అహ్మద్ గారికి 14 సం॥ వయస్సు. ఆ తరువాత వారు ఆ అంకిత స్ఫూర్తిని ఎంతో గొప్పగా నెరవేర్చినారు. అందుకు ఉదాహరణ కూడ కష్టముగానే లభిస్తుంది.

వారి ధార్మిక సేవల వివరాలు ఈ విధముగా ఉన్నాయి. 1954 నుండి 1957 వరకు వారు ఇంగ్లాండ్‌లో ఒక ముబల్లిఘ్‌గా సేవలందించారు. ఆ మధ్య కాలంలోనే వారు హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి గారి సూచనల మేరకు స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ విద్యను అభ్యసించారు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మహుల్లాహు తాలా గారితో, కలిసి మెలసి ఉండేవారు. కొంత కాలం లండన్ మిషన్ కు సెక్రటరిగా బాధ్యతలను నిర్వర్తించారు. 1957 నుండి 1959 వరకు వకాలతే దీవాన్‌లో రిజర్వ్ ముబల్లిఘ్‌గా కూడ సేవలందించారు. ఆ తరువాత 1960లో జామిఅలో ఉపాధ్యాయుడిగా నియమించబడ్డారు. 1978 వరకు ఉపాధ్యాయ బాధ్యతలను నిర్వర్తించారు. 1978 నుండి 1982 వరకు అమెరికాలో ముబల్లిఘ్‌గా కొనసాగారు. 1982 నుండి 1986 వరకు స్పేయిన్‌లో సేవలందించు భాగ్యమును పొందారు. 1986 నుండి 1989 వరకు వకీలే తస్నీఫ్‌గా సేవలందించారు. 1986 నుండి 2010 వరకు జామిఅ అహ్మదియ్య రబ్వాలో ప్రిన్సిపల్‌గా సేవలందించారు. ఆ మధ్య కాలంలో 1994 నుండి 2001 వరకు వకీలే తాలీమ్‌గా కూడ సేవలందించారు. అదే విధముగా రిసర్చ్ సెల్‌కు ఇంచార్జ్‌గా కొనసాగారు. సిలువ సెల్‌కు కూడ ఇంచార్జ్‌గా కొనసాగారు. 2005లో నూర్ ఫౌండేషన్‌ను స్థాపించినప్పుడు వీరు దానికి అధ్యక్షులుగా కొనసాగారు. అలా చివరి వరకు ఆ పదవిలోనే కొనసాగారు.

హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు వారిని 3 జూన్ 1962లో ఇఫ్తా కార్యవర్గ సభ్యులుగా నియమించారు. నవంబర్ 1972 వరకు వారు సభ్యుడిగానే కొనసాగారు. ఆ తరువాత 1989లో మరల హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రజి వారిని మరల ఇఫ్తా కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. తుది శ్వాస వరకు కూడ సభ్యుడిగానే కొనసాగారు.

ఖుద్దాముల్ అహ్మదియ్యాలో కూడ అనేక స్థాయిలలో సేవలందించు భాగ్యాన్ని పొందారు. కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. విజ్ఞాన రంగంలో కూడ విశ్వతమైన సేవలందించారు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మ గారి ఖుర్‌ఆన్ అనువాదంను సిద్ధం చేయడంలో చాలా సహాయాన్ని అందించారు. ఈ విషయాన్ని కూడ హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మగారు ప్రస్తావించారు. ఎంతగానో అభినందించారు. రబ్వాలో సహాయం అందించిన వారిని గూర్చి కూడ ప్రస్తావించారు. వారిలో సూఫి బషారతుర్రహ్మాన్ గారు, మౌలానా అబుల్ మునీర్ నూరుల్ హఖ్, సయ్యద్ అబ్దుల్ హయ్యు సాహెబ్, మౌలానా దోస్త్ ముహమ్మద్ సాహెబ్, జమీలుర్రహ్మాన్ రఫీఖ్ సాహెబ్ గార్లకు కూడ సేవలందించు భాగ్యము లభించింది. వారు రహ్మ గారు మరల ఇలా తెలిపారు. వీరిలో మీర్ మహ్‌మూద్ అహ్మద్ గారు కూడ ఉన్నారు. అల్లాహ్ అనుగ్రహం వలన వీరు నాతో నిరంతరం కలిసి పని చేశారు. హుజూర్ రహ్మ వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

**(ఖుర్‌ఆన్ అనువాదం, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మ గారు , అభినందనల వెల్లువ)**

సిహా సిత్తా పూర్తిగా ఉర్దూ అనువాదం చేసిన తరువాత ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ అనువాదం కొనసాగుతుంది. అదే విధముగా సహి ముస్లిం విశ్లేషణల పర్వం కూడ కొనసాగుతుంది. షమాయిలే తిర్మిజి అనువాదం కూడ వారే చేశారు. బైబిల్ ను గూర్చి రెండు పదుల సంఖ్యలో విజ్ఞాన వ్యాసాలను వ్రాసారు. అవి అనేక పత్రికలలో, సంచికలలో ప్రచురించబడ్డాయి. బైబిల్‌లోని ఇస్తిస్నా మరియు ఇంజీల్‌లోని మూడు ఘట్టాల విశ్లేషణలు పూర్తి అయినాయి. అదే విధముగా మసీహ్ శవ వస్త్రం, ఏసు చికిత్స, హజ్రత్ మసీహ్ అలైహిస్సలాం గారి ప్రస్థానం వంటి అంశాలపై అత్యంత ఆమోధిత పరిశోధనలను చేశారు. ప్రస్తుతం వారికి చెందిన ప్రచురించబడిన, ప్రచురించబడని జ్ఞాన సంపద కలదు. సీరతున్నబి సల్లల్లాహు అలైహి వసల్లం **"కాన ఖులుఖుహుల్ ఖుర్‌ఆన్"** మూడు భాగాలలో గలదు. **"మన ప్రియ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ప్రియమైన ప్రవచనాలు"** అనే పుస్తకం కూడ గలదు. **360 రోజులు** అనే మరొక చిన్న పుస్తకం గలదు. ఈ పుస్తకంను ప్రతిరోజు నమాజ్ తరువాత బోధన చేయడం కోసం రూపకల్పన చేయడమైనది. **ఫలస్తీనా నుండి కశ్మీర్ వరకు** అనే మరొక పుస్తకం గలదు. **హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి రచనల ఆధారముగా ప్రవక్త జీవిత చరిత్ర** అనే మరొక పుస్తకం గలదు. వారు ఈ పుస్తకానికి కావలసిన జ్ఞాన సంపదను సమకూర్చారు. ఇంకా ప్రచురించబడలేదు. సహి బుఖారి నుండి ఎంపిక చేయడం జరిగింది. ఇందులో శిక్షణకు సంబంధించిన అంశాలు గలవు. అదే విధముగా ఒకసారి గత పోప్ లేవనెత్తిన ఒక ప్రశ్నను వీరు ఖండించారు. అదే విధముగా స్పేయిన్‌లో మస్జిద్ బషారత్‌కు చెందిన శంకుస్థాపన రోజున హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాలిస్ రహ్మ గారు దుఆ చేసి ఇచ్చిన పునాది రాయిని హజ్రత్ మీర్ సాహెబ్ గారే తీసుకొచ్చి పునాది వేశారు. అదే విధముగా మస్జిద్ బషారత్ ప్రారంభోత్సవ సమయంలో కూడ వారికి మరియు వారి శ్రీమతికి సేవ చేయు భాగ్యము లభించింది. ఈ విషయాన్ని హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మగారు ప్రస్తావించారు.

**(ఖుత్బాతే తాహిర్ సంపుటి 1, పేజి 139, జుమా ప్రసంగం 10, సెప్టెంబర్ 1982)**

1955లో జల్సాసాలాన ప్రారంభోత్సవ సందర్భములో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి గారు ఆ రోజు 8 నిఖాల ప్రకటనలు చేశారు. వారిలో మీర్ మహ్‌మూద్ అహ్మద్ సాహెబ్ గారి నిఖా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి గారు తమ కుమార్తె అమతుల్ మతీన్ సాహెబ్ గారితో జరుగుతున్నట్లుగా ప్రకటించారు. ఆ సందర్భంలో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి గారు ఇలా తెలిపారు. సాధారణముగా నిఖాల ప్రకటన డిసంబర్ 29వ తేదిన ప్రకటించడం జరుగుతుంది. కాని ఈ నిఖాలలో కొన్ని ప్రత్యేకమైన నిఖా ప్రకటనలు ఉన్నాయి. వాటిలో ఒకటి నా కుమార్తె అమతుల్ మతీన్ నిఖా ప్రకటన గలదు. ఈ నిఖా సయ్యద్ మీర్ మహ్‌మూద్ అహ్మద్ ఇబ్న్ మీర్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ సాహెబ్ గారితో నిశ్చయించడమైనది. ఆ తరువాత వివరణాత్మకముగా ప్రస్తావించడం జరిగింది. మరల ఇలా తెలిపారు. ప్రస్తుతం మహ్‌మూద్ అహ్మద్ లండన్‌లో బి.ఏ చదువుతున్నారు. ఒకవేళ అల్లాహ్ తాలా క్షేమముగా చూసినచో వచ్చే సంవత్సరం మే వరకు తిరిగి వస్తాడు. నేను నా ముగ్గురు పిల్లలను, వారు రజి ముగ్గురు పిల్లలను గూర్చి ప్రస్తావించారు. ఆ తరువాత ఖలీఫతుల్ మసీహుస్సాని రజి గారు వారి పేర్లను ప్రస్తావించారు. కాబోయే అల్లుడు మహ్‌మూద్ అహ్మద్‌ను, మరో అల్లుడు దావూద్ అహ్మద్‌ను. సయ్యద్ మీర్ దావూద్ అహ్మద్ సాహెబ్ గారిని ప్రస్తావించారు. తాహిర్ అహ్మద్ ను వీరు ఉమ్మే తాహిర్ గారి కుమారుడు. అనగా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ రహ్మ గార్లను ప్రస్తావించుతూ వారిని ఉన్నత విద్యాభ్యాసం కోసం, భవిష్యత్తులో జమాఅత్‌కు సేవలందించడం కోసం లండన్‌లో వదిలి వచ్చాను. మరల వారు రజి ఇలా తెలిపారు. ఒకవేళ వారికి ఆంగ్ల విద్య బాగా వచ్చినచో , నిజానికి వీరు ముగ్గురు మౌల్వీ ఫాజిల్‌లు. పైగా అరబి విద్య

కూడ చాలా గొప్పగా వస్తుంది. ఒకవేళ ఆంగ్ల విద్య కూడ గొప్పగా నేర్చుకున్నచో ఖుర్ఆన్ షరీఫ్ మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి రచనలను ఆంగ్లబాషలోకి అనువదించి, జమాఅత్ వ్యాప్తి చెందడంలో సహాయకులుగా నిలువ గలరు. మరల ఇలా తెలిపారు. అదే విధముగా రియాయూ ఆఫ్ రిలీజియన్ కూడ ఒక మంచి, అనుభవజ్ఞుడైన సంపాదకుడిని కోరుకుంటుంది. కావున నా పిల్లలను నేను అక్కడ వదిలి వచ్చాను. నిజానికి ఈ అనారోగ్య, బలహీన స్థితిలో ఆ ముగ్గురి ఖర్చులు భరించడం కష్టతరమే అయినప్పటికి, ఇద్దరు అల్లులు, ఒక కుమారుడు వారికి నేర్పించడం జరుగుతంది. కష్టం అయినప్పటికి నా కష్టం ముందు జమాఅత్ కష్టం చాల పెద్దది. కావున చదువిస్తున్నాను.

**(ఖుత్బాతే మహ్మూద్, సంపుటి 3, పేజి 672-674, ప్రసంగం 26 డిసంబర్ 1955)**

జమాఅత్ కొరకు అన్ని రకాల త్యాగాలు చేయాలనే ఆలోచన హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఎల్లప్పుడు ఉండేది. ఇందుకోసం అన్ని రకాలుగా త్యాగాలు చేశారు. తమ సంపదను, తమ సమయాన్ని, పిల్లలను కూడ త్యాగం చేశారు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాలిస్ రహ్మ గారు 1982లో వారి పెద్ద కుమారుడి నిఖా ప్రకటన చేశారు. అప్పుడు హజ్రత్ మీర్ ముహమ్మద్ ఇస్హాఖ్ రజి గారి సంతానంను గూర్చి కూడ ప్రస్తావించారు. వారి సంతాన ప్రస్తావనలో సయ్యద్ మీర్ మహ్మూద్ అహ్మద్ సాహెబ్‌ను గూర్చి ప్రస్తావించారు. ఆ క్రమంలో వారు రహ్మ గారు ఇలా తెలిపారు. అల్లాహ్ తాలా వారి దుఆలను ఆలకించాడు. అనగా హజ్రత్ మీర్ ముహమ్మద్ ఇస్హాఖ్ సాహెబ్ రజి గారి దుఆలను ఆలకించాడు. తనతో వారికి ఉన్నటు వంటి ప్రేమను చూసి అనగా హజ్రత్ మీర్ ముహమ్మద్ ఇస్హాఖ్ సాహెబ్ రజి గారికి అల్లాహ్ పట్ల ఉన్నటు వంటి ప్రేమను చూసి అల్లాహ్ తాలా వారి ముగ్గురు కుమారులకు జీవిత అంకితం చేయు భాగ్యమును కల్పించాడు. ఒక వ్యక్తి మరోవ్యక్తికి భిన్నముగా ఉన్నట్లుగానే ఆ ముగ్గురి స్వభావములు కూడ భిన్నముగా ఉండేవి. కాని ఈ విషయంలో నేను గ్రహించినంత వరకు అనగా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాలిస్ రహ్మ ఇలా తెలిపారు. నేను గ్రహించినంత వరకు ఈ ముగ్గురిలో ఒక లక్షణం సాధారణముగా కనిపిస్తుంది. అదేమనగా అల్లాహ్ ఏమి ఇచ్చిన కూడ మానవుడు అందుకు సంతృప్తితో ఉండేడమే కాకుండా సంతోషముగా ఉండాలి. కేవలం సంతృప్తితో ఉండడమే కాకుండా సంతోషంతో కృతజ్ఞతలు తెలపాలి. మరల ఇలా తెలిపారు. సయ్యద్ మీర్ దావూద్ అహ్మద్ సాహెబ్ తన స్వంత స్వభావంను కల్గియున్నా కూడ వారిలో ఈ లక్షణం కనిపిస్తుంది. మీర్ మసూవూద్ అహ్మద్ ప్రస్తుతం చాలా కాలం నుండి డెన్మార్క్‌లో ప్రచారం చేస్తున్నారు. వారు స్వంత స్వభావాన్ని కల్గియున్నా కూడ ఈ లక్షణాన్ని కల్గియున్నారు. అదే విధముగా వారి చిన్న సోదరుడు మీర్ మహ్మూద్ అహ్మద్ సాహెబ్, ఈ రోజు నేను వారి నిఖా ప్రకటన చేస్తున్నాను, వారు కూడ తన వ్యక్తిగతమైన జీవిత అంకిత స్వభావాన్ని కల్గియున్నారు కాని వారిలో కూడ ఈ లక్షణం సాధారణముగా కనిపిస్తుంది. అనగా సంతోషంగా ఉండడం, జమాఅత్ ఇచ్చిన దానిని స్వీకరించడం. ఎలాంటి డిమాండ్ చేయకపోవడం. వంటివి. వారి తండ్రి గారి ఈ వారసత్వ లక్షణం వారి సంతానంలో ప్రతి ఒక్కరికి సంక్రమించింది. అల్లాహ్ తాలా హజ్రత్ మాము జాన్ రజియల్లాహు తాలా అన్హు గారి సంతానంపై అనగా మీర్ ఇస్హాఖ్ సాహెబ్ సంతానంపై చాలా అనుగ్రహాలను కురిపించాడు. ఈ కారణంచేతనే జమాఅత్ కొరకు వారు ప్రదర్శిస్తున్న ఆదర్శం మరియు జమాఅత్ ముందు ఎల్లప్పుడు నవ్వుతూ, చురుకుగా కనిపిస్తు ఉంటారు. అంతేగాకా ఎల్లప్పుడు అల్లాహ్ తాలాకు కృతజ్ఞతలు తెల్పుచూ, అతనిని స్తుతించుచూ, తమ జీవితాలను కొనసాగిస్తున్నారు.

**(ఖుత్బానిఖా 10 మే 1982, ఖుత్బాతే నాసిర్, సంపుటి 10, పేజి 728-729)**

మరల వారు రహ్మ గారు వారి కోసం దుఆ చేశారు. అనగా వీరి సంతానం కూడ ఆయా లక్షణాలను పొందుతూ ఉండాలని దుఆలు చేయండి. కవిత్వం పట్ల కూడ వారికి కొంత ఆసక్తి ఉండేది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి పద్యాలు మరియు కలామే మహ్మూద్ యొక్క పద్యాలు గుర్తు చేయడమే కాకుండా స్వయముగా కూడ పద్యాలు వ్రాసారు. మరల వారు జామిఅ లో చదువుకోవాలనుకునే మురబ్బిలను, మురబ్బిలు కావాలనుకునే ఆకాంక్షను కల్గియుండి, ఇంకా ప్రవేశం పొందనివారిని గూర్చి ఒక హితోపదేశం చేశారు. ఒక కార్యనిర్వాహక ప్రణాళికను రూపొందించారు. చాలా మంచి ప్రణాళిక అది. మురబ్బీలు మరియు జామిఆలో చదువాలనుకునే వారు, జామిలో చేరినవారు ఆ ప్రణాళికను తమ ముందు ఉంచుకోవాలి.

మొదటి విషయం ఏమిటనగా, ప్రతిరోజు ఉదయం 3 గంటలకు మేల్కొని వజూ చేసుకొని తహజ్జుద్ చదవవలెను. పాకిస్తాన్ సమయం ప్రకారంగా తహజ్జుద్ చదువే సమయం ఇదే. ప్రతిరోజు 5 పర్యాయముల నమాజ్‌లను మస్జిద్‌కు చేరుకొని సామూహికముగా చదువవలెను. రబ్వాలో ఉండేవారికి మస్జిద్ ముబారక్‌లో కనీసం ఒక్క నమాజ్ అయినా చదవాలి అని పేర్కొన్నారు. ఆ తరువాత ప్రతి రోజు అల్లాహ్ తాలా ప్రీతిని పొందడం కోసం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అభిమానం కోసం, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అభిమానంను పొందడం కోసం, ఖలీఫాల అభిమానంను పొందడం కోసం దుఆలు చేస్తుండాలి. 5 విషయమేమనగా, అల్లాహ్‌ను స్తుతించడం, దరూద్ షరీఫ్‌ను పఠించడం, ప్రాయశ్చిత్తం చేసుకోవడంను తమ అలవాటుగా మార్చుకోవాలి. 6వ విషయమేమనగా, హజ్రత్ సాహెబ్ లేదా వర్తమాన ఖలీఫా గారి సన్నిధికి ప్రేమ పూర్వక భావాలను వ్యక్తపరుస్తూ దుఆ కోసం లేఖ వ్రాయడం. 7వ విషయం ప్రస్తుతం తమపై ఉన్నటు వంటి బాధ్యతలను, విధులను చాలా మంచిగా నిర్వర్తించవలెను. 8వ విషయం. తమ తల్లిదండ్రులకు సేవ చేయవలెను. ఒకవేళ వారు దూరంగా ఉన్నచో వారి కోసం దుఆలు చేయవలెను. 9వ విషయం ఖుర్ఆన్ కరీం అనువాదంను అక్షర పరంగా, భావ పరంగా నేర్చుకోవడానికి ప్రయత్నించవలెను. 10 వ విషయం రూహాని ఖజాయిన్‌ను కనీసం 3 సార్లు అయినా చదవవలెను. 11వ విషయం ప్రతి రోజు అల్ ఫజల్ మరియు ఒక సాధారణ పత్రికను చదవవలెను. ప్రతి రోజు సేవాకార్యక్రమములో భాగంగా ఒక పని అయినా చేయవలెను. వారి కుమారుడు గులాం అహ్మద్ ఫరాఖ్ గారు వారిని గూర్చి ఈ విధముగా వ్రాసారు. కొన్ని విషయాలను ప్రస్తావించుతాను. మా తండ్రి గారికి అల్లాహ్ తాలా పట్ల ఉన్నటు వంటి అభిమానంను నమాజ్ మరియు ఇతర స్మరణల ద్వారా వ్యక్తపర్చేవారు. వారి నమాజ్‌లను నేను కూడ చూశాను. మస్జిద్‌లో ఒక మూలకు ఎంతో భక్తి శ్రద్ధలతో నమాజ్‌లను చదివేవారు. ఇంట్లో కూడ ఇలాంటి నమాజ్‌లనే చదివేవారు కావచ్చు. అవి మనకు కనిపించవు. కాని వారు మస్జిద్‌లో చదివే నమాజ్‌లలో ఒక విచిత్రమైన స్థితి కనిపిస్తుంటుంది. ఒక స్వాభావికమైన, అన్యోన్యమైన దృశ్యంలా కనిపించేది. నిజానికి వారు ప్రజల ముందే వ్యక్తపర్చేవారు కాదు. కాని కొన్ని సార్లు నమాజ్ ద్వారా వ్యక్తమయ్యేది. ప్రజలే స్వయముగా ఈ విషయాన్ని గ్రహించేవారు. ఉదా॥ వారు ఇలా వ్రాసారు. నేను మా తండ్రిగారి నోట్ బుక్‌ను చదివాను. మొదటి పదం అల్లాహ్ అని వ్రాసేవారు. అదే విధముగా ఇతర పుటలలో మరియు డైరిలో కూడ అనేక వరుసలలో కేవలం అల్లాహ్ అని మాత్రమే వ్రాసి ఉండేది. వారు తమ చివరి రోజులలో తమ గదిలో ఒక వాక్యంను వ్రాశారు. ఓ మా అల్లాతీ ఆమూ . దీని అర్థం ఏమిటని నేను వారిని అడుగగా, వారు ఇది ఇటాలియన్ పదం. దీని అర్థం నేను నిన్ను ప్రేమిస్తున్నాను . వారు అల్లాహ్‌కు అలా వ్రాసారు.

అల్లాహ్ స్తుతించుచు వ్రాసిన ఒక పద్యం ఉన్నది. అందులోని ఒక పంక్తి ఇలా గలదు.

నాకు పొందే భాగ్యం ఉండాలి, నాకు ఎల్లప్పుడు లభించాలి.
నీ దర్శన భాగ్యం నీ సంభాషణల పర్వం.

అనారోగ్యముగా ఉన్నరోజులలో ఒకసారి వారికి అపెండిక్స్ ఆపరేషన్ జరిగింది. అస్సలాము అలైకుం అనే వినికిడి వినిపించింది. ఆరోగ్యవంతులైనారు. వారి ప్రార్థనలు, నమాజ్‌ల తత్వం కూడ అల్లాహ్ అనుబంధంతో ముడిపడి ఉండేవి. ఆ రెండింటిని వేరు చేయలేము. తహజ్జుద్ నమాజ్‌లో వారు చేసే దుఆ విధానంను గూర్చి అనేక సార్లు చెప్పారు. ముందుగా అల్లాహ్‌ను స్తుతించడం, అల్లాహ్ తాలాతో అనుబంధాన్ని ఏర్పడడం కోసం దుఆలు చేయడం చేసేవారు. ఒకరోజు ఇలా తెలిపారు. నాతో ఇలా అన్నారు. నేను ప్రతిరోజు తహజ్జుద్ నమాజ్‌లో మా పిన్నాన్న అనగా హజ్రత్ డాక్టర్ సయ్యద్ మీర్ ముహమ్మద్ ఇస్మాయీల్ సాహెబ్ రజియల్లాహు తాలా అన్హు గారి పద్యాలను చదివేవాడిని. పిన్నాన్న గారు "నీవు " అనే శీర్షికతో ఆ పద్యాన్ని వ్రాసారు.

ఇలాజె దర్దే దిల్ తుం హెూ హమారే దిల్ రుబా తుం హెూ.
తుమహార ముద్దుఆ హం హై౯ హమార ముద్దుఆ తుం హెూ.
అనగా మనోబాధకు చికిత్స నీవే, మనస్సును నిండా నీవే.
నీ ఆకాంక్ష మేము, మా ఆకాంక్ష నీవు.

తహజ్జుద్ నమాజ్‌లో దుఆ చేయు విధానంను గూర్చి కూడ తెలిపారు. సంక్షిప్తముగా నేను మీ ముందు ప్రస్తావించుతాను. వారి కుమారుడు ఇలా తెలిపాడు. అల్లాహ్‌ను స్తుతించడం, దరూద్ షరీఫ్‌ను పఠించిన తరువాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరియు వారి వారసుల కొరకు మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఖలీఫాల కోసం, వారి వారసుల కోసం , హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి మరియు వారి రజి వారసుల కోసం వేరుగా దుఆలు చేస్తుండేవారు. ఆ తరువాత తమ తాతగారైన హజ్రత్ మీర్ నాసిర్ నవాబ్ సాహెబ్ రజి గారి నుండి దుఆలు చేస్తూ నెమ్మది నెమ్మదిగా క్రింది స్థాయికి చేరుకోవడం చేసేవారు. తమ సంతానంలో ముందుగా తమ కుమార్తే కోసం ఆ తరువాత ముగ్గురు కుమారుల కోసం, దుఆలు చేసేవారు. దేవుని దాసుల హక్కులను చెల్లించడం కోసం సరైన మార్గం దుఆనే భావించేవారు. ఖిలాఫత్ పట్ల అభిమానం వారిలో విశ్వతముగా కనిపించేది. కాని అందరి కంటే ఎక్కువ అభిమానం వారికి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల ఉండేది. చాలా ప్రేమ ఉండేది.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సాంప్రదాయంను అనుసరించుటకు పూర్తిగా ప్రయత్నించేవారు. ఆ విషయాన్ని చిన్న చిన్న మాటల ద్వారా కూడ వ్యక్తపరిచేవారు. వారి కుమారుడు ఇలా తెలిపాడు. ఒకటి రెండు సార్లు ఈ విధముగా కూడ జరిగింది. అనగా వారు ఏదో ఒక కుర్చిలో కూర్చునేవారు. నేను మరొక కూర్చిలో ప్రశాంతంగా కూర్చునేవాడిని. నేను వారి కోసం నా కుర్చిని ఖాళి చేసినప్పుడు వారు ఆ కుర్చిలో కూర్చునే వారు కాదు. పైగా ఒకరు కూర్చున్న కుర్చిలో నుండి వారిని లేపి కూర్చోవడాన్ని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇష్టపడేవారు కాదని తెలిపేవారు. నిస్సందేహముగా నీవు నా కుమారుడవే అయినా, నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సాంప్రదాయంకు వ్యతిరేకముగా ఇతరులు కూర్చున్న కుర్చిని, ఇతరుల కుర్చిని కూర్చోవడం కోసం తీసుకోవడం మంచిది కాదు. నేను అలా చేయలేను అని అనేవారు. అదే విధముగా దారి వెంట నడుస్తున్నప్పుడు సలాం తెల్పడంలో ముందు ఉండుటకు ప్రయత్నించేవారు. శుక్రవారం రోజున జుమా నమాజ్ తరువాత మరియు అసర్ నమాజ్ వరకు దుఆలు చేస్తూ ఉండేవారు. ఆ మధ్య సమయంలో వారిని కలవడానికి ఎవరైన వచ్చినచో అయిష్టపడేవారు. ఎందుకనగా ఇది దుఆలు ఆమోదించబడే సమయం అని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారు. ఆ సమయంలో వారిని పలుకరించడానికి పిల్లలమైన మేము కూడ వెళ్ళేవారము కాదు అని తెలిపారు.

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మించిన రోజు మరియు స్వర్గస్థులైన రోజు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జన్మించిన రోజు మరియు స్వర్గస్థులైన రోజు అధికముగా దరూద్ షరీఫ్ పఠించమని గట్టిగా హితోపదేశం చేసేవారు. స్వయముగా వారు కూడ ఎక్కువ సంఖ్యలో సుబ్‌హానల్లాహి వబి హమ్‌దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీమ్ అల్లాహుమ్మా సల్లి అలా ముహమ్మదిన్ వ్వఅలే ముహమ్మదిన్ ను పఠించేవారు. మరల ఇలా తెలిపారు. ఒకసారి ఖాదియాన్‌కు వెళ్ళాను. ఆ సమయంలో నాకు ఒక దుఆను వ్రాసి ఇచ్చారు. దారుల్ మసీహ్‌కి చెందిన ప్రతి గదిలో ముందుగా నా తరుపున అనగా మీర్ సాహెబ్ తరుపున ఈ దుఆను చదువుము. అదే విధముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి మీజార్ పై కూడ ఈ దుఆను చదువుము అని సూచించారు. మజ్లిస్ షూరలో తమ అభిప్రాయాన్ని వ్యక్త పర్చినందుకు 1990లో వారిపై ఒక కేసు మోపబడింది. కేసు 298సి. కాని న్యాయమూర్తి వారితో మీరు మీ ఉపన్యాసంలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు సహాబ రిజ్వానుల్లాహ్ అలైహిం అజ్మయీన్‌లను కించపరిచారా? అని అడిగారు. అందుకు వారు ఎంతో ధైర్యముగా ఆ మాటను ఖండించారు. ఆ మాట వలన నాకు చాలా బాధ వేసింది అని నాతో కూడ చెప్పేవారు. న్యాయమూర్తి వారితో ఇలా అన్నాడు. మీర్ మహ్‌మూద్ అహ్మద్ చర్చించుచున్న సమయంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు సహాబ రిజ్వానుల్లాహ్ అజ్మయీన్‌లను గూర్చి కించపర్చే విధముగా పదాలను పలికాలు. అందుకు మీర్ మహ్‌మూద్ అహ్మద్ సాహెబ్ గారు “ ఇది నాపై నిందారోపణ. ఇది అబద్ధం! అబద్ధం! అబద్ధం! నేను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు సహాబలను మనస్ఫూర్తిగా గౌరవిస్తాను. వారి ప్రవక్తుత్వంపై నాకు పూర్తి విశ్వాసం ఉన్నది. ” అని సమాధానం ఇచ్చారు. ఆపై వారు ఇలా అన్నారు. నేను సయ్యద్‌ను. ప్రవక్త (స) వంశీయులకు చెందిన వాడిని. అబద్ధం ఆడేవారిని దేవుడు శపించుగాకా!. న్యాయమూర్తి ముందు వారు చాలా ధైర్యముగా మాట్లాడినారు. చివరి రోజులలో ప్రత్యేకించి దూఆలలో మరియు దరూద్ షరీఫ్ పఠనంలో ఎక్కువగా గడిపారు. నేను ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బానిసను అని పదే పదే వ్యక్తపర్చేవారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పట్ల ఉన్నటు వంటి అభిమానంను కూడ వ్యక్త పర్చేవారు. ఈ విషయంలో వారికి వారే ఒక ఉదాహరణ. వారి కుమారుడు ఒకరు ఇలా తెలిపారు. నాకు బాగా గుర్తున్న విషయమేమనగా, అల్ ఫజల్ రబ్వా దినపత్రిక జమాఅత్ యొక్క శతాబ్ధి వేడుకలను పురస్కరించుకోని జమాఅత్ చెందిన మహోన్నతులను ఇంటర్వ్యూ చేసింది. ఆ క్రమంలో వారు కేవలం సంక్షిప్తముగా “ మానవునికి సజీవమైన దేవున్నితో మరల అనుబంధం ఏర్పర్చడం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అత్యంత గొప్ప మహత్యం.” అని అన్నారు. ఇలాంటి పదాలను వారు పలికేవారు.

అనారోగ్యంగా ఉన్న రోజులలో కొన్ని సార్లు ఖాదియాన్ వెళ్ళుటకు ప్రయత్నించేవారు. కాని వెళ్ళలేక పోయేవారు. కార్యక్రమం రద్దు అయ్యేది. కాని ఖాదియాన్ పట్ల చాలా అభిమానం ఉండేది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి మీజార్‌ను చూడాలనే ఆకాంక్ష ఉండేది. అందువలన వారు అన్ని రకాల కష్టాలను భరిస్తూ దుఆ కోసం వెళ్ళేవారు. పఠనంను గూర్చి ఇలా వ్రాసారు. ఖుర్‌ఆన్ కరీం, బుఖారి, రూహాని ఖజాయిన్‌లను ప్రతిరోజు పఠనం చేసేవారు. మమ్ములను కూడ అలా పఠనం చేయమని కోరుకునేవారు. వారిని కలవడానికి వచ్చిన వారికి కూడ పఠనం చేయమని సూచించేవారు. 1990లో వారిపై కేసు మోపడం జరిగింది. ఒక రాత్రి చిన్యూట్ జైలులో కూడ ఉన్నారు. మరల ఇలా తెలిపారు. నేను కలవడానికి వెళ్ళాను. వారు నాతో “ ఒక బకీట్, మగ్గు, బరాహీనే అహ్మదియ్యను తీసుకొచ్చి ఇవ్వమని అన్నారు. ఆ సమయంలో వారితో పాటు మియాం ఖుర్షీద్ అహ్మద్ సాహెబ్ కూడ ఉన్నారు. మియాం సాహెబ్ గారు వారితో “ ఇంత ఇరుకైన జైలు గదిలో, ఇంతటి వేడిలో, అంత క్లిష్టమైన గ్రంథాన్ని ఎలా పఠించగలవు? ” అని అడిగారు. అందుకు వారు “ ఏం పర్వాలేదు. నాకు ఎలాంటి కష్టం అనిపించదు. గతంలో కూడ నేను ఆ గ్రంథాన్ని 5 సార్లు చదివాను” అని సమాధానం ఇచ్చారు. మొత్తానికి అక్కడ చిన్న గది. వేసవి కాలం. ఆ ఒక్కరోజు కూడ వారు చాలా కష్టంగా గడిపారు. ఎందుకనగా చాలా పరిశుభ్రతను పాటించేవారు. పరిశుభ్రత వారి స్వభావంగా మారిపోయింది. వారి దృష్ట్యా ఇది చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. అయినా కూడ వారు ఆ సమయంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి గ్రంథాన్ని పఠించే చింతనలో ఉన్నారు. ధార్మిక పరిజ్ఞానం విషయానికి వచ్చినచో వారు ఇస్లామీయ గ్రంథాలనే కాకుండా యూద మరియు క్రైస్తవ మత గ్రంథాలను కూడ పఠించేవారు. వాటిపై కూడ వారికి చాలా పరిజ్ఞానం గలదు. విభిన్న మతాల అధ్యాయణలపై వారికి చాలా ప్రత్యేకమైన నేర్పు గలదు. సాంప్రదాయ ధార్మిక పరిష్కారాల పట్ల అసంతృప్తిగా ఉండేవారు. ఎల్లప్పుడు ఖుర్‌ఆన్ కరీం, ప్రవక్త (స) సాంప్రదాయం, సహీ అహదీస్, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరియు హుజూర్ (అ) గారి ఖలీఫాల ఆధ్యాత్మిక సూచనలతో మార్గదర్శకాలను పొందాలని పదే పదే హితోపదేశం చేసేవారు. ప్రాపంచిక పరిజ్ఞానం విషయానికి వచ్చినచో ప్రత్యేకించి సైన్స్ మరియు చరిత్రకు సంబంధించిన పుస్తకాలను పఠించేవారు. అదే విధముగా మానసిక ఉల్లాసం కోసం విహార యాత్రలకు సంబంధించిన పుస్తకాలను కూడ అధ్యాయనం చేసేవారు. ఆంగ్లేయ కవిత్వాలను, ఉర్దూ కవిత్వాలను కూడ చదివేవారు. చాలా మంది కవుల కవిత్వపు పంక్తులు వారికి గుర్తున్నాయి. అదే విధముగా తమ ఐపాడ్‌లో కవుల కవిత్వాలను వినేవారు. భాషలను నేర్చుకునే కుతూహలం అధికముగా ఉండేది. ఉర్దూ, అరబి, ఆంగ్లంతో పాటు స్పేయినీస్, ఇటాలియన్, ఇబ్రానీ భాషలపై కూడ చాలా పట్టును సాధించారు. ఇటాలియన్ కార్యక్రమాలను టి.వి మరియు ఐపాడ్‌లలో క్రమం తప్పకుండా చూస్తుంటారు. ఇందుకు గల కారణమేమనగా, ఒకానోక సమయంలో ఇటాలియన్ భాషను కూడ నేర్చుకొమ్మని హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా వారితో అన్నారు. అంతేగాకుండా వారిని ఇటలీకి పంపబడును అని కూడ వ్యక్తపరిచారు. హుజూర్ రజి భాషను నేర్చుకొమ్మని వారికి సూచించారు. కావున నేను నేర్చుకుంటున్నాను అని వారు సమాధానం ఇచ్చేవారు. ఆ సూచనను వెనకకు తీసుకోలేదు కావున ఆ సూచన నేటికి నాకు వర్తిస్తుంది. అందుకే నేను నేర్చుకుంటున్నాను అని అనేవారు. ఎంతో ఉత్సాహంగా ఆర్థిక త్యాగాలలో పాల్గొనేవారు. అదే విధముగా వారికి ఎప్పుడు ఆస్థి వారసత్వంగా వచ్చినా కూడ వెంటనే వారు ఆస్థికి చెందిన భాగపు చందా కూడ చెల్లించేవారు.

ప్రస్తుతం జామిఅ ప్రిన్సిఫల్‌గా కొనసాగుతున్న ముబష్షిర్ అయాజ్ సాహెబ్ ఇలా వ్రాసారు. మీర్ సాహెబ్ గారు ఎంతో అమయాకమైన, పరిశుద్ధమైన జీవితాన్ని గడిపారు. ఎంతో పవిత్రత గలవారు. అయినా కూడ వినయశీలురు. సామాన్య స్వాభావికంను కల్గినవారు, పొదుపుపాటించువారు, నమ్మకానికి గొప్ప ఆదర్శప్రాయులు. విజ్ఞాన వివేకతలతో కూడిన ఒక సముద్రం వంటివారు. చాలా గొప్ప ధార్మిక పండితులు. వారి ప్రతి మాట సత్యవంతమైనది. వారు ఖుర్‌ఆన్ విశ్లేషకులు, హదీస్ పండితులు, అహ్మదియ్య జమాఅత్ చరిత్రలోనే ఖుర్‌ఆన్ కరీం అనువదించడంతో పాటు సిహా సిత్తా (ఆరు ప్రముఖ హదీస్ ) గ్రంథాలను ఉర్దూ భాషలోకి అనువదించు భాగ్యమును పొందిన మొట్టమొదటి అదృష్టవంతులు వీరు. మీర్ సాహెబ్ గారి జీవితం ఒక ఆరాధన. కేవలం సేవ, సేవ. కేవలం సేవ మాత్రమే. మీర్ సాహెబ్ గారి జీవితపు డిక్షణరిలో సెలువు అనే పదమే లేకుండెను. మీర్ సాహెబ్ నిస్సందేహముగా ఖిలాఫత్ అభిమానంతో నిండియున్నవారు. వారు ఖిలాఫత్ పట్ల విధేయతను, ఖిలాఫత్ పట్ల అభిమానమును కల్గియుండి మనకు అట్టి విధానంను చూపించారు, నేర్పించారు. ఖిలాఫత్‌ను ఇలా గౌరవించాలని వారు ఆచరణాత్మకముగా చూపించారు. సైకిల్‌పై సమయానికి జామిఅ వెళ్ళేవారు. 7:20 నిమిషాలకు జామిఅ ప్రారంభమయ్యేది. వీరు 7:20 నిమిషాల వరకు అక్కడికి చేరుకునేవారు. రెండు మూడు సార్లు సైకిల్ పై నుండి కూడ క్రింద పడ్డారు. ఒకసారి అరోగ్యం బాగలేకుండెను. అనారోగ్యముగా ఉండెను. ఆ సమయంలో నేను వారితో మీరు 10 గంటల వరకు వేచి ఉండండి. 10 గంటల తరువాత జామియకు వెళ్ళండి అని చెప్పాను. దానిని కూడ వారు ఆదేశంగానే భావించారు. అందువలన ఆ తరువాత నుండి 10 గంటలకు జామిఅకు వెళ్ళేవారు. ముబష్షిర్ అయాజ్ సాహెబ్ మరొక విషయాన్ని కూడ ఇలా వ్రాసారు. ఒకరోజు 10 గంటల కంటే ముందే జామిఅకు వచ్చారు. ప్రాంగణంలో అటు ఇటు నడవసాగారు. కొంత సమయం వారికోసం ఎదురు చూశాను. ఆ తరువాత వారి వద్దకు వెళ్ళి

మీరు ఇలా బయట ప్రాంగణంలో ఎందుకు తిరుగుచున్నారు? జామిఅలోకి ఎందుకు రావడం లేదు? అని అడిగాను. అందుకు వారు ఇంకా 10 కాలేదు. 10 గంటలకు కార్యాలయంకు వెళ్ళమని ఖలీఫా గారు నన్ను ఆదేశించారు. కావున నేను 10 గంటలకే వస్తాను అని అన్నారు. వారు ఆదర్శప్రాయమైన విధేయతకు ఒక ఉదాహరణ. ప్రజల కోసం, అధికారుల కోసం, సిబ్బంది కోసంవారు ఒక ఆదర్శం.

ఖాదియాన్‌కు చెందిన మురబ్బీ తన్వీర్ నాసిర్ సాహెబ్ ఇలా వ్రాసారు. వారు ఎల్లప్పుడు నాకు గుర్తుకుండే ఘట్టము ఏమిటనగా, ఒకరోజు నేను మస్జిద్ ముబారక్‌లో కూర్చున్నాను. ఆ సమయంలో మీర్ సాహెబ్ మస్జిద్‌లోని మొదటి వరుసలో పచార్లు చేస్తున్నారు. నోటిలో దుఆలు చదువుతూ, అలా వారు పచార్లు చేయడం నాకు గొప్పగా అనిపించింది. నేను చాలా అనుభూతిని పొందుతున్నాను. కొంత సమయం తరువాత నేను ధైర్యం చేసుకోని, ముందుకు వెళ్ళి " ఇలా మీరు మస్జిద్‌లోని ముందు వరుసలో పచార్లు చేస్తున్నారు. ఇందుకు గల కారణం ఏమిటి?" అని అడిగాను. అందుకు వారు " హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు తాలా అన్‌హు గారు ఈ చోట పచార్లు చేయడాన్ని నేను చూశాను. కావున నేను కూడ హుజూర్ రజి గారి అడుగుజాడలో పచార్లు చేస్తున్నాను " అని అన్నారు. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి పట్ల వారికి అద్భుతమైన అభిమానం ఉండేది.

ఫిరోజ్ ఆలం గారు ఇలా వ్రాసారు. నేను జామిఅలో చదువుతున్న 2వ లేదా 3వ సంవత్సరం వీరు జామిఅకు ప్రిన్సిపల్‌గా వచ్చారు. మా అదృష్టం ఏమిటనగా, వారు విద్యాబుద్ధుల కంటే ఎక్కువగా తమ ఆదర్శప్రాయమైన వ్యక్తిత్వం ద్వారా, ఆచరణాత్మక ధార్మిక పండితుడిగా మాకు శిక్షణను నేర్పించారు. సాధ్యమైనంత వరకు నేను వారి బోధనలను వినేవాడిని. అందుకు అనుగుణముగా నడుచుకొనుటకు ప్రయత్నించేవాడిని. వారు మాకు విభిన్న మతాల అధ్యాయనంలను బోధించేవారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు తమ రచనలలో పొందుపర్చిన ఆధారాలను వారు మాకు వ్రాయించేవారు, గుర్తు చేయించేవారు. మరల ఇలా తెలిపారు. నాకు బాగా గుర్తున్న విషయమేమనగా, ఒకరోజు వారు మాకు హజ్రత్ ఈసా అలైహిస్సలాం గారి అద్భుతాలను గూర్చి బోధిస్తున్నారు. ఒక్కసారిగా వారు ప్రశ్నార్థకముగా " ఈ రోజులలో కూడ అద్భుతాలు వెలువడుతాయా?" అని ప్రశ్నించారు. ఆ తరువాత వారు తమ అనుభవను చెందిన ఒక ఘటనను వినిపించారు. ఒకసారి జల్సా సమయంలో వారు డ్యూటి చేస్తున్న ప్రాంతంలో భోజనం చాలా తక్కువగా ఉన్నది. అనుకోకుండా అథితులు ఎక్కువగా వచ్చారు. సాధారణముగా పంపిన భోజనాన్ని అతిథులకు వడ్డించడం ప్రారంభించాము. అల్లాహ్ తాలా అట్టి భోజనంలోనే సంవృద్ధిని కల్పించాడు. అందుకు సంతృప్తిగా భోజనం చేశారు. ఎవరికి ఎలాంటి అసంతృప్తి కలుగలేదు.

మురబ్బీగా కొనసాగుతున్న వారి మనుమడు హాషిర్ అహ్మద్ ఇలా వ్రాసాడు. అల్లాహ్ తాలా పట్ల అమితమైన అభిమానం ఉండేది. అల్లాహ్ తాలా పట్ల ఉన్న అభిమానపు అద్భుత ప్రభావాన్ని పెద్దలు మరియు పిన్నలు ప్రతి ఒక్కరి మనస్సులో నాటి వెళ్ళారు. క్రమం తప్పకుండా తహజ్జుద్‌ను చదివేవారు. క్రమం తప్పకుండా నమాజ్‌లను చదివేవారు. ఇప్పుడు వీరు మురబ్బీ అయ్యారు. వీరు కూడ తమ తాత గారి అడుగుజాడలో నడుచుటకు ప్రయత్నించవలెను. ఖుర్‌ఆన్ కరీం పట్ల చాలా అభిమానం ఉండేది. ఇంతటి అభిమానంను నేను ఎప్పుడు చూడలేదు. ఫజర్ తరువాత సుదీర్ఘమైన పారాయణం చేసేవారు. మరల ఇలా తెలిపాడు. నేను బాల్యంలో ఉన్నప్పుడు కొన్ని రోజులు వారి ఇంట్లో గడిపే అదృష్టాన్ని పొందాను. తహజ్జుద్ చదివిన తరువాత ఫజర్ నమాజ్ కోసం నన్ను మేల్కొపేవారు. ఆ తరువాత సుదీర్ఘమైన పారాయణం చేసేవారు. ఎంతో శ్రద్ధతో, అభిమనంతో పారాయణం చేసేవారు. నేను చాలా ప్రభావితుడిని అయ్యేవాడిని. మరల ఇలా తెలిపాడు. నేను జామిఅలో ప్రవేశం పొందాను. కెనడాకు చెందిన జామిఅలో ప్రవేశం పొందాడు. నేను అక్కడికి వెళ్ళిన తరువాత ఖుర్‌ఆన్ కరీం అనువాదంను, విశ్లేషణలను వేరు వేరుగా బోధిస్తున్నారా? లేక కలిపి బోధిస్తున్నారా? అని అడిగేవారు. అందుకు నేను వేరు వేరుగా బోధిస్తున్నారు అని సమాధానం ఇచ్చాను. అందుకు వారు సంతోషించేవారు. ఇలాగే బోధించవలెను. ఎందుకనగా ప్రజలు విశ్లేషణ వస్తుంది కాని అనువాదం రావడం లేదు అని అనేవారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పట్ల వారికి గల అభిమానంను ఈ విధముగా తెలిపారు. వారు రూహాని ఖజాయిన్ ప్రేమికులు. వారు నాతో అనేక సార్లు ఇలా అన్నారు. నేను హజ్రత్ అఖ్దస్ అలైహిస్సలాం రచనలను అనేక సార్లు చదివాను. కాని చదివిన ప్రతిసారి క్రొత్త క్రొత్త అంశాలు అర్థమయ్యేవి. రూహాని ఖజాయిన్ ను అధ్యాయనం చేసినచో నీకు కూడ ఖుర్‌ఆన్, హదీస్ మరియు జీవిత చరిత్రకు సంబంధించిన అంశాలు అన్ని అర్థమవుతాయి అని నాతో అనేవారు. వారు నాతో కూడ ఈ విషయాన్ని ప్రస్తావించారు. వారు ఇలా అన్నారు. నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం రచనలను కనీసం మూడు సార్లు అయినా చదివాను. కొన్ని రచనలను మూడు కంటే ఎక్కువ సార్లు చదివాను. అయినా కూడ వారిలో చాలా వినయం కనిపించేది. ఎన్నడు కూడ తన విజ్ఞానంను వ్యక్తపర్చలేదు. మరల ఇలా తెలిపాడు. ఒకసారి ఇంట్లో జుమా ప్రసంగాన్ని వింటున్నాము. రబ్వాలో కరెంట్ పోయింది. పాకిస్తాన్‌లో ఎక్కువగా కరెంట్ పోతూ ఉంటుంది. అందువలన టి.వి బంద్ అయిపోయింది. నేను పిల్లవాడిని. నేను అక్కడి నుండి వెళ్ళుతుండగా వారు " కూర్చో, దుఆలు చదువుతూ ఉండూ, వెళ్ళడానికి వీలు లేదు. వీటి ద్వారా కూడ చాలా అనుగ్రహాలు కల్గుతాయి. కరెంట్ ఎప్పుడు వస్తుందో నీకేం తెలుసు?. ఖలీఫా జుమా ప్రసంగం ప్రారంభమవుతుంది. నీవు కొన్ని పదాలను వినలేక పోవచ్చును. " అని అన్నారు. సహించేవారు కాదు. ఒకసారి ఒక కార్యక్రమం నిర్వహించబడింది. అక్కడ నా ప్రసంగం కొనసాగాలి. వారికి సమాచారం అందలేదు. వారు వినలేక పోయారు. ఎంటిఏ ఆన్ చేసేలోగా కార్యక్రమం ముగిసిపోయింది. మరొక వ్యక్తికి ఐపాడ్‌లో ఆ కార్యక్రమాన్ని సెట్ చేసి ఇవ్వమని కోరారు. అప్పటికి వేరొక భాషలో కార్యక్రమం కొనసాగుతుంది. అయినా కూడ వారు శ్రద్ధగా విన్నారు. నేను వచ్చిన తరువాత ఉర్దూ భాషలో కార్యక్రమాన్ని సెట్ చేసి ఇచ్చాను. అందుకు వారు చాలా సంతోషించారు. నీవు నాకు కార్యక్రమాన్ని సెట్ చేసి ఇచ్చావు అని చాల అభినందన పూర్వకముగా అన్నారు. నాకు చాలా సహాయం చేశారు. ఎంతో ఉపకారం చేశారు. పిల్లలతో కూడ అభినంధన పూర్వకముగా ఉండేవారు.

రియాయా ఆఫ్ రిలీజియన్ సంపాదకులు ఆమిర్ సఫీర్ సాహెబ్ ఇలా వ్రాసారు: నేను కూడ వారిలో ఖిలాఫత్ పట్ల గల విధేయతలో విచిత్రమైన, అసాధారణమైన ఉదాహరణను చూశాను. మరల ఇలా తెలిపారు. నేను ఈ శాఖలోకి వచ్చిన తరుణంలో వారు నా వద్దకు వచ్చి ఇలా అన్నారు. నిజానికి నేనే స్వయముగా ఆమిర్ సాహెబ్‌కు రియాయా కొరకు వ్యాసాలు వ్రాయమని మీరు ఉలమాలను కోరండి అని తెలియజేశాను. అంతేగాకుండా కొంత మంది ఉలమాల పేర్లనుకూడ పంపాను. వారిలో మీర్ మహ్మూద్ అహ్మద్ సాహెబ్ గారి పేరు కూడ ఉన్నది. మొత్తానికి వారు ఇలా తెలిపారు. ఆ సమయంలో వారు పాకిస్తాన్‌లో ఉన్నారు. ఆ సమయంలో విశ్రాంతి తీసుకుంటున్నారో లేదో అని తెలుసుకున్నాను. సుమారు రాత్రి 10 లేదా 11 గంటల సమయం అది. వారి బంధువులు లేదు అని సమాధానం ఇచ్చారు. మరల ఇలా తెలిపారు. నేను ఫోన్ చేశాను. వారి శ్రీమతి ఫోన్ తీశారు. ఈ విషయంను గూర్చి మాట్లాడాలి అని అనుకుంటున్నాను అని వారికి తెలియజేశాను. అందుకు వారు ప్రస్తుతం వారు నిద్రపోతున్నారు అని సమాధానం ఇచ్చారు. కాని ఆ సమయంలో మీర్ సాహెబ్ మేల్కొన్నారు. వారు బహుశా ఫోన్ శబ్దం విని లేదా సంభాషణ కారణంగానైన మేల్కొని ఉండవచ్చును. మొత్తానికి వారు మాట్లాడారు. అప్పుడు నేను వారితో ఖలీఫతుల్ మసీహ్ ఇలా సూచించారు. కావున మీరు రియాయా కోసం ఫలానా వ్యాసాన్ని రాయండి అని కోరాను. అందుకు వారు ఇప్పుడు నాకు అర్థం కావడం లేదు. ఉదయం మాట్లాడుతాను అని అన్నారు. మొత్తానికి మరుసటి రోజు వారు అనగా మీర్ సాహెబ్ 15 పుటల ఒక వ్యాసాన్ని వ్రాసి నాకు పంపించారు. నేను ఆ వ్యాసాన్ని "ఈ వ్యాసం వారి నుండి వచ్చింది " అని ఆమిర్ సఫీర్ గారికి పంపాను. మీరు సాహెబ్ ఇలా వ్రాసారు. రాత్రి వేళ ఒక వ్యక్తి ఫోన్ చేసి " మీరు ఈ వ్యాసాన్ని వ్రాయాలని ఖలీఫతుల్ మసీహ్ సూచించారు అని తెలిపాడు. కావున నేను ఈ వ్యాసాన్ని వ్రాసాను. 15 పుటలతో ఉన్న మొదటి భాగాన్ని పంపుచున్నాను. ఇక ముందు కూడ పంపుతూ ఉంటాను. " ఈ స్థాయి మేరకు వారు విధేయతను చూపేవారు. సమయ పాలనను కూడ పాటించేవారు. నేను ముందుగా తెల్పినట్లు 10 గంటల సమయం కానిదే కార్యాలయం లోనికి వచ్చేవారు కాదు. 10 గంటలు అయినప్పుడే లోనికి వస్తాను అని వచ్చేవారు.

మసీహ్ శవవస్త్రాన్ని గూర్చిన వారి కార్యక్రమము కొనసాగేది. దానిని గూర్చి ఇక్కడ జల్సా సమయంలో ప్రదర్శనలు జరిగేవి. ఆ కార్యక్రమాలలో కూడ ప్రతి సంవత్సరం పాల్గొనేవారు. హజ్రత్‌మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి బోధనల ఆధారంగా వారు అన్ని విషయాలను వివరించేవారు. మరల ఆమిర్ సఫీర్ గారు ఇలా వ్రాసారు. మురబ్బీలు ఏదేని విజ్ఞాన ఆంశంను గూర్చి అధ్యాయనం చేస్తున్నప్పుడు వారు ప్రాథమిక అనగా జమాఅత్ కోణాలను వదిలి ప్రాపంచిక కోణాలలో అధ్యాయణం చేయడానికి ఎక్కువ మక్కువ చూపుతారు. కాని వారు మాత్రం ముందుగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి రచనలు

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**
**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**
**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

మరియు అభిమతాలను పూర్తిగా అర్థం చేసుకున్న తరువాత అన్యమతస్థుల లేదా ఇతర పరిశోధకుల ఆధారాలను అధ్యాయణం చేసేవారు. అంతేగాని భిన్నముగా అధ్యాయణం చేసేవారు కాదు. మరల ఇలా వ్రాసారు. మీర్ సాహెబ్ గారు ఎంతో నమ్మకంగా ప్రపంచంలోని గొప్ప గొప్ప నేర్పు కల్గిన మసీహ్ శవ వస్త్ర పరిశోధకులకు హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అభిమతాన్ని వివరించేవారు. హజ్రత్ ఈసా అలైహిస్సలాం సిలువ నుండి ప్రాణాలతో బయటపడు సంఘటన. దీనిని గూర్చి చేసిన పరిశోధనలను, ఆయా సంఘటనలను రియాయీయా ఆఫ్ రిలీజియన్స్‌కు చెందిన బృందం వివిధ కోణాలలో చాలా సంవత్సరాలుగా పరిశోధనలు చేస్తుంది. మర్హమే ఈసాను గూర్చి సైన్స్ మరియు చారిత్రక, సామాజిక కోణాలను ప్రవేశ పెట్టుతూ జమాఅత్ సిద్ధాంతాలను బలోపేతం చేయాలనేది వారి ప్రయత్నం. కాని మీర్ సాహెబ్ గారి వ్యవహార శైలి అందుకు భిన్నముగా, విభేదముగా ఉండేది. వారి విధానమేమనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలంమసీహ్ శవ వస్త్రంను గూర్చి బలమైన ఆధారాలను ప్రవేశపెట్టారు. కావున మనం కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఆధారాలను పునాది చేసుకోవాలి మరియు ఇతర అంశాలకు ద్వితీయ ప్రాధాన్యతను ఇవ్వాలి అనేవారు. వారు పదే పదే ఈ సిద్ధాంతాన్నే అవలంభించేవారు. అనగా మర్హమే ఈసాయే సిలువ ఘటనను అర్థం చేసుకోవడానికి మూలం అని తెలిపేవారు. రియాయీయా బృంధం యొక్క ప్రయత్నాల వలన నిజానికి జమాఅత్ సభ్యుల విశ్వాస స్థాయి బలపడింది మరియు ప్రముఖులతో సత్సంబంధాలు నెలకొన్నాయి. కాని విజ్ఞాన పరంగా నిర్ణయాత్మక ప్రభావం పడలేక పోయింది. కాని మీర్ సాహెబ్ గారి ప్రోత్సహ విధానం చివరికి తన ప్రభావంను చూపించింది. నేటి కాలపు శవవస్త్ర ఆధ్యాయపు అనుభవజ్ఞులు, ప్రముఖ ఫోటో గ్రాఫర్ అయినా బ్రీ స్వాటర్జ్ కూడ స్వయముగా అంగీకరించిన విషయమేమనగా ఒకవేళ మీరు నిజంగా మర్హమే ఈసాను గూర్చి మీ సిద్ధాంతాలను నిరూపించినచో ఏసుక్రీస్తు నిజంగా సిలువపై నుండి ప్రాణాలతో బయటపడ్డారు అని నేను కూడ విశ్వసించవలసి ఉంటుంది అని అన్నారు.

వారిని గూర్చిన అనేకానేక విషయాలను గూర్చి అనేక మంది వ్రాసారు. ఇంకా ఉన్నాయి. వారి పిల్లలు, వారి వారసులు, ఇతరుల నుండి , జీవిత సమర్పితుల నుండి, మురబ్బీల నుండి వచ్చాయి. కాని వాటినన్నింటిని పేర్కొనడం కష్టం. ప్రతి మురబ్బి వ్రాసిన ఏకైక అంశమేమనగా, ఒకవేళ ప్రతి ఒక్కరు కాకపోయిన అధికులు వ్రాసిన సాధారణమైన విషయమేమనగా వారు ఇలా అనేవారు. ఖబర్ అనే పదాన్ని తీసుకోండి. దానికి అనుగుణముగా నడుచుకోండి. ఆ ఖబర్ కు వారు ఈ విధమైన అర్థాన్ని తెలిపేవారు. " ఖ " అనగా ఖుర్ఆన్ మరియు " బ " అనగా బుఖారి హదీస్ గ్రంథము మరియు "ర " అనగా రుహాని ఖజాయిన్. మరల ఇలా అనేవారు. ఒకవేళ మీరు వీటిలో ప్రావీణ్యతను సాధించినచో, వాటిని పొందినచో, అందుకు అనుగుణముగా నడుచుకొనుటకు ప్రయత్నించినచో, వాటి నుండి విజ్ఞానమును నేర్చుకొనుటకు ప్రయత్నించినచో, వాటి ద్వారా ఆధ్యాత్మికను నేర్చుకొనుటకు ప్రయత్నించినచో మీరు మీ జీవిత పరమార్థాన్ని పొందడంలో విజేయులవుతారు. నిజానికి ఖబర్ అనే పదం కూడ స్వయముగా అలాగే ఉన్నది. ఒకవేళ మానవునికి ఆ పదం గుర్తున్నచో అల్లాహ్ తాలా గుర్తుకువస్తాడు. అల్లాహ్ తాలా గుర్తుకు వచ్చినచో మానవుడు నిష్టాపరతతో నడుచుకోవడానికి ప్రయత్నిస్తాడు. మొత్తానికి వారు ఖిలాఫత్ కొరకు ఒక గొప్ప సహాయకుడు, చేయుతకారుడు. అంకిత భావం గలవారు. ఒక్కొక్క అక్షరంకు అనుగుణముగా ఆచరించేవారు. గౌరవ ప్రదనీయుడు. చాలా అరుదుగా లభించు అద్భుత సహాయకులు. ఆచరణాత్మకమైన ధార్మిక పండితులు. వారి వంటి ఆదర్శప్రాయులు ప్రస్తుతం నాకు కనిపించడం లేదు. అల్లాహ్ ఖజానాలో ఎలాంటి తగ్గుదల ఉండదు. ఇలాంటి అనేక ఆదర్శప్రాయులను అల్లాహ్ అందించుగాకా!. ఇలాంటి గౌరవప్రదమైన, స్వచ్చతగల, నిష్టాపరత గల సహాయకులను అల్లాహ్ అహ్మదియ్య ఖిలీఫాలకు ఎల్లప్పుడు అందించు గాకా! వారి తండ్రి దుఆలకు వారి సంతానాన్ని వారసులను చేయుగాకా!. వారి నడవడికకు, వారి హితోపదేశాలకు అనుగుణముగా నడుచుకునే భాగ్యాన్ని కల్పించు గాకా!.

రెండవ ప్రస్తావన నేను ముందుగా తెల్పినట్లుగా ఒక అహ్మదీయ మిత్రునిది. వారు కొన్ని రోజుల క్రితం ఖైదీలో ఉండగా మృతి చెందారు. వారి పేరు డాక్టర్ తాహిర్ మహ్మూద్ సాహెబ్. వీరు గులాం రసూలు సాహెబ్ కరాచి గారి కుమారుడు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. మృతి చెందునాటికి వారి వయస్సు 70 సంవత్సరాలు. వివరాలలోకి వెళ్ళినచో , కరాచిలోని మాలేర్ కాలనీకి చెందిన సదర్ అయిన మృతడు తాహిర్ మహ్మూద్ సాహెబ్ మరియు ఇతర ఇద్దరు మిత్రులు ఏజాజ్ హుస్సేన్ సాహెబ్ మరియు అయాజ్ హుస్సేన్ సాహెబ్‌కు వ్యతిరేకముగా కరాచిలోని మాలేర్ కాలనిలో మస్జిద్ రూపంలో మన మస్జిద్ ఉన్నందున, మరియు అక్కడ జుమా నమాజ్ చదివిన కారణంగా పోలీసులు వారికి వ్యతిరేకముగా కేసు నమోదు చేసి, వారిని ఆధీనంలోకి తీసుకున్నారు. ముందుగా వారిని అరెస్ట్ చేయడానికి ముందు జమానత్ చూపించడం జరిగింది. కాని తరువాత వారు అట్టి జమానత్‌ను తిరస్కరిస్తూ వారిని అరెస్ట్ చేశారు. వారు జమానత్ కోసం కోర్టులో ఉన్నప్పుడు వ్యతిరేకుల సమూహం మరియు వ్యతిరేక న్యాయవాదులు వారిపై దాడి చేశారు. వారిని గాయపర్చుటకు ప్రయత్నించారు. భయంకరమైన బెదిరింపులకు గురి చేశారు. అంతేగాకుండా పోలీస్ వ్యక్తులలో ఒకరు అక్కడికి వచ్చిన గుంపును ఉద్దేశించి వారిని కాల్చివేయండి అని రెచ్చగొట్టాడు. పోలీస్ స్టేషన్‌లో కూడ వారిని హింసించడం జరిగింది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మరియు ఖలీఫాలకు వ్యతిరేకముగా దూషించమని బలవంతం చేయడం జరిగింది. కాని వారు అభిమానంతోనే ఉన్నారు. స్థిరత్వమును ప్రదర్శించారు. ఆ తరువాత వారిని కోర్టు ఆదేశాల మేరకు జైలుకు పంపించడం జరిగింది. జైలులో వీరు రెండు నెలల వరకు ఉన్నారు. మరణానికి కొన్ని రోజుల ముందు వరకు వారి మూత్రపిండాలు చెడిపోవడం వలన ఆరోగ్యం క్షీణించింది. ఫలితముగా వారిని జైలు నుండి ఆసుపత్రికి పంపించారు. కాని కొన్ని రోజుల తరువాతనే వారు మృతి చెందారు. మృతి చెందిన సమయంలో ఆసుపత్రిలో కూడ వారి చేతికి బేఢీలు వేసి ఉన్నాయి. వారిని హింసించడం వలన వారు మృతి చెందారు. బహుశా వారికి లోలోపల గాయాలై ఉండవచ్చును. ఈ కారణం చేతనే వారు మృతి చెందవచ్చును. వారు జైలు కష్టాలను అనుభవించారు. దెబ్బలు తిన్నారు. కోర్టు ముందు కొట్టబడ్డారు. ఈ కారణాలన్నియు మరియు ఈ సాక్ష్యాలన్నియు పరిశీలించినచో వారి మరణం వీరమరణం అనబడుతుంది. వీరు అమరుల జాబితాలో పరిగణించబడుతారు. వసియ్యత్ వ్యవస్థలో భాగస్వాములు. సదర్‌గా, ప్రచార కార్యదర్శిగా, ఇతర అనేక ఉపశాఖలలో సేవలందించు భాగ్యము వారికి లభించింది. వారి పెద్దనాన్న హకీం అహ్మద్ దీన్ సాహెబ్ ద్వారా వారి వంశంలోకి అహ్మదియ్యత్ ప్రవేశించింది. వారి పెద్దనాన్న హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అనుచరులైన హజ్రత్ మౌల్వి ఇమాం దీన్ సాహెబ్ రజియల్లాహు తాలా అన్‌హు ద్వారా 1920లో రెండవ ఖలీఫా కాలంలో బైఅత్ చేసి అహ్మదీయ్యత్‌ను స్వీకరించారు. వారి పెద్దనాన్న తరువాత వారి తండ్రి గారు బైఅత్ చేసి అహ్మదియ్యత్‌ను స్వీకరించారు. పేదలకు ఆశ్రయం కల్పించేవారు, వారికి ఆర్థిక సహాయంను అందించేవారు. అనేక మంది పేద పిల్లల వివాహాలు జరిపించారు. జైలులో కూడ తోటి ఖైదీలకు సహాయం చేసేవారు. వీరు జైలులో ఉన్నప్పుడు వీరిని కలవడానికి వెళ్ళినప్పుడు జైలులో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగినచో ఇబ్బందులు ఎక్కడివి? నేను ధర్మం కొరకు ఇక్కడికి వచ్చాను. నాకు ప్రచారం చేయు అవకాశం లభిస్తుంది అని సమాధానం ఇచ్చేవారు. నిర్భయముగా, నిరభ్యంతరంగా ప్రచారం చేసేవారు. తాహిర్ మహ్మూద్ సాహెబ్‌కు వ్యతిరేకముగా 17 జనవరి 1988లో కరాచిలోని మాలేర్ కాలనీలో ఒక కేసు నమోదు చేయబడింది. కేసు ఏమిటనగా నా తమ్ముడితో ఇతడు బైఅత్ చేయించాడు అని అతని సోదరుడు కేసు పెట్టాడు. అప్పుడుకూడ వీరు జైలులోనే ఉన్నారు. వీరికి రెండవసారి ఖైది భాగ్యము లభించింది. వ్యతిరేకులను ఎదురించే అవకాశం కూడ వారికి లభించింది. మూడు సార్లు వారిపై దాడి చేయడం జరిగింది. కాని తన వ్యవహారంను అల్లాహ్‌కు అప్పగించారు. వారు ఒక కల చూశారు. ఒక దాడికర్త అల్లాహ్ శిక్షకు గురైనాడు. ఆ తరువాత వీరిపట్ల శత్రుత్వం వ్యక్తపరిచే వ్యక్తి తన వ్యక్తి గత గొడవల కారణంగా హత్య చేయబడ్డాడు. ఆ కారణంగా మిగిలిన ఇద్దరు మృతుని ఇంటికి వచ్చి వారు చేసిన దౌర్జన్యానికి క్షమాపణలు కోరారు. మృతుడు వెంటనే వారిని క్షమించివేశాడు. ఎలాంటి కేసు నమోదు చేయలేదు. మృతుని శ్రీమతి ఇలా తెలిపింది. మాతో వారు ఉదాహరణీయముగా వ్యవహరించేవారు. జమాఅత్ కొరకు అంకితం చేశారు. రాత్రి వేళ ఇంటికి ఆలస్యంగా వచ్చినా కూడ ఎలాంటి ఫిర్యాదు ఉండేది కాదు. ఎందుకనగా మృతుని ధార్మిక సేవ కారణంగా అల్లాహ్ తాలా మాకు పరోక్షముగా సహాయ సహకారములు అందిస్తున్నాడనే సంతృప్తి మాకు ఉండేది. మృతుని కుమారులలో ఒకరు జీవిత సమర్పితులు మరియు మురబ్బి సిల్‌సిలా అయ్యాడు. వారి కుమారుడు ఇలా వ్రాసాడు. 1980వ దశాబ్దకాలంలో తండ్రిగారికి ఖైది భాగ్యం లభించింది. ఆ సమయంలో కూడ పోలీసులు వారిపై చాలా దౌర్జన్యం చేశారు. ఎప్పుడైన ఎవరైన హింసించుటకు ప్రయత్నించినచో ఎంతో ఉద్వేగంగా ఇలా అనేవారు. నేను పోలీసుల దెబ్బలు తిన్నాను. కావున ఇక నాకు ఎలాంటి భయం, ఆందోళనలు లేవు. ఇకపై నేను నిర్భయముగా ప్రచారం చేస్తాను. వారి జ్ఞాపకార్థం మృతినికి శ్రీమతి గౌ॥ ముభష్శిరా సాహెబాతో పాటు ఒక కుమార్తే, ముగ్గురు కుమారులు గలరు. కుమరుడైన మునీబ్ మహ్మూద్ గారు మురబ్బి సిల్‌సిలా. పాకిస్తాన్‌లోనే సేవలందిస్తున్నారు. అల్లాహ్ తాలా మృతిని స్థాయిని పెంచుగాకా! కరుణించుగాకా! వారి సంతానాన్ని వారి అడుగు జాడలో నడిపించు గాకా!. నమాజ్ తరువాత జనాజ నమాజ్ చదివించుతాను.

**(అల్ ఫజల్ ఇంటర్నేష్నల్ , 7 జూన్ 2025, పేజి 2-7)**

## సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఉనికిని విశ్వసించడం వల్ల కలిగే ప్రయోజనాలు మరియు ఆశీర్వాదాలు....

గౌరవనీయులైన సభాధ్యక్షుల వారు, వేదికపై ఉన్న పెద్దలు మరియు శ్రోతలందరికి అస్సలాము అలైహికుం......

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో మానవ జన్మ యొక్క ఉద్దేశ్యాన్ని **వమా ఖలఖ్‌తుల్ జిన్నా వల్ ఇన్‌సా ఇల్లా లి యఅబుదూన్** (జ్జారియాత్:57) అనగా మేము మానవులను మరియు జిన్నాతులను నన్ను ఆరాధించాలనే ఉద్దేశ్యంతోనే సృష్టించడం జరిగింది అని తెలిపాడు.

ఒకచోట ఇలా తెలిపాడు. **అల్లజి ఖలఖల్ మౌత వల్ హయత లి యబ్‌లువకుం అయ్యుకుం అహ్‌సను అమలా** (అల్ ములుక్: 3) అనగా అల్లాహ్ తాలాయే మరణాన్ని మరియు జీవితాన్ని సృష్టించిన వాడు. తద్వారా మీలో ఎవరు ప్రవర్తనలోఉత్తమమైన వారు అని అతను మిమ్మల్ని పరీక్షించ దలచాడు.

మరల ఇలాఅన్నాడు. **ఇన్నా హదైనాహు స్సబీల ఇమ్మా షాకిరన్ వ ఇమ్మా కఫూర** (సూరఅద్దుహర్ (76)" అనగా నిశ్చయముగా మేము వారికి సన్మార్గమునకు చెందిన మార్గదర్శకము చేశాము. ఎమైనప్పటికి (వారు) కృతజ్ఞతతో (నడవవచ్చును) లేదా కృతజ్ఞత రహితముగా నడవవచ్చును

మరొక చోట మానవున్ని హెచ్చిరిస్తూ ఇలా తెలిపాడు. **అఫహసిబద్‌తుమ్ అన్నమా ఖలఖ్‌నాకుం అబసన్ వ్వ అన్నకుం ఇలైనా లా తుర్‌జ ఊన్** (మోమినీన్:116) అల్లాహ్ తాలా మానవ జాతిని ఉద్దేశించి ఇలా తెలిపాడు. మేము మిమ్ములను లక్ష్యరహితముగానే సృష్టించామని, మీరు ఎన్నటికి మా వద్దకు తిరిగి రారు అని మీరు భావిస్తున్నారా?.

పైన పేర్కొనబడిన సూక్తులన్నింటిలో అల్లాహ్ తాలా ఎంతో స్పష్టముగా "అతడు మానవులకు సన్మార్గంవైపు మార్గదర్శకం చేసినట్లుగా" తెల్పుచున్నాడు. **ఇమ్మా షాకిరన్ వ్వ ఇమ్మా కఫూర** అనగా అతడు కృతజ్ఞుడైన దాసుడిగా మారి తన జీవితపు ప్రయాణాన్ని కొనసాగిస్తాడా? లేదా కృతజ్ఞత రహితుడై తన జీవితాన్ని కొనసాగిస్తాడా? అనేది ఇక మానవుని ఇష్టం.

కోట్లాది మంది ప్రజలు అల్లాహ్ తాలాకు కృతజ్ఞత వంతులైన దాసులుగా మారి తమ జీవితపు పరమార్థ సాధనవైపు వడివడిగా అడుగులు వేస్తున్నారు. కాని మానవజాతిలో కొంత మంది మాత్రం **కఫూర** అనగా కృతజ్ఞతరహితముగానే అట్టి మార్గంలో జీవనంను కొనసాగిస్తున్నారు. వారు గర్వం, అహంకారంతో కూడిన మార్గంలో నడుస్తూ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఉనికినే తిరస్కరిస్తున్నాడు. ఇలాంటి నాస్తికులకు మరియుకపటులకు సర్వశక్తిమంతుడైన అల్లాహు ఖుర్‌ఆన్ మజీద్‌లో ఈ విధముగా హెచ్చరించాడు. **వజరబలనా మసలన్‌ఁ వ్వ నసియ ఖల్‌ఖలహు** (యాసీన్:79) మానవుడు మా ఉనికి గురించి మాట్లాడటం ప్రారంభించాడు కాని తన జన్మను మరచిపోతున్నాడు.

సయ్యిదినా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మానవజాతి మొత్తాన్ని ఉద్దేశించి ఇలా తెలిపారు. "తనకంటూ ఒక సృష్టికర్త ఉన్నాడని, అతడు అన్నింటిపై సర్వశక్తిని కల్గియున్నాడని ఇప్పటి వరకు తెలియని మానవుడు ఎంతటి దౌర్భాగ్యుడు. మనస్వర్గం మనదేవుడు, మనఅభిరుచులు మన దేవునిలోఉన్నాయి. ఎందుకంటే మేము అతనిని చూశాము మరియు అతనిలో అన్ని రకాల సౌభాగ్యములు గలవు. ప్రాణమిచ్చి సంపాదించినా ఈసంపదను తీసుకోవడం విలువైనదే, సర్వస్వాన్ని పోగొట్టుకుని సంపాదించినా ఈ ఆణిముత్యంను తప్పక కోనుగోలు చేయవలెను. ఓ అభాగ్యులారా! ఈ నీటి చెలిమవైపు పరుగెత్తండి, అది మీ దాహాన్ని తీరుస్తుంది. ఇది జీవితాన్ని ప్రసాధించు చెలిమ. ఇదే మిమ్ములను కాపాడుతుంది. నేను ఏమి చేయాలి? ఏ విధముగా ఈ శుభవార్తను ప్రజల మనస్సులో నాటదెను. ఇతడే మ ఈ దేవుడు అని ప్రజలకు తెలపడానికి నేను ఏ మద్దెల ద్వారా వీధులలో చాటింపు వేయవలెను. తద్వారా ఆలకించుటకు వారి చెవులు తెరుచుకొనుటకు నేను ఏ ఔషదం ద్వారా వారికి చికిత్స చేయవలెను. "

(కిస్తియే నూహ్, రూహాని ఖజాయిన్ సంపుటి 19, పేజి 21)

ప్రియమైన శ్రోతాలారా!. అల్లాహ్‌తాలా ఖుర్‌ఆన్ మజీద్‌లో అన్ని కాలముల వారికి ఈ విధముగా నచ్చజెప్పినాడు. అనగా వలా యుహీతూన బి షైయిన్ మ్మిన్ ఇల్‌మిహీ ఇల్లా బిమా షాఅ (బఖర: 256) ఓ మానవుడా నీవు అల్లాహ్ విజ్ఞానంను ఏ మాత్రం అంచనా వేయలేవు. కాని అల్లాహ్ తాలా స్వయముగా వ్యక్త పర్చుకున్నదే. అతని అనుగ్రహం లేనిదే నీకు ఏ విషయంను తెలుసుకునే అవకాశం ఏదేని ఆవిష్కరణలు చేయు భాగ్యము లభించదు. అల్లాహ్ తాలా కోరుకున్నచో మాత్రమే సాధ్యమవును.

గత మూడు శతబ్దాల నుండి అల్లాహ్ తాలా మానవజాతిలో ఒక వర్గానికి చెందిన వారికే పారిశ్రామిక రంగంలో పురోగతిని సాధించు సామర్థ్యాన్ని అందించాడు. కంప్యూటర్ సైన్స్, మెడికల్ సైన్స్ మరియు టెక్నాలజీకి చెందిన ఇతర రంగాలలో కూడ మానవులకు కొంత మేరకు సఫలీకృతమును అందించాడు. ఆయా ఆవిశ్కరణలు మరియు పారిశ్రామిక రంగంలో మానవ జాతికి చెందిన ఒక వర్గానికి ఎంతటి గర్వం ఏర్పడిందనగా వారు ఏకముగా అల్లాహ్ తాలా యొక్క ఉనికినే తిరస్కరించసాగారు.

ఇలాంటి మానవులను ఉద్దేశించి అల్లాహ్ ఈ విధముగా హితోపదేశం చేస్తున్నాడు. (కాహఫ్: 104-106)

ఈ సూక్తులలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హుజూర్ సల్లల్లాహుఅలైహివసల్లం యొక్క మాధ్యమం ద్వారా, ప్రతి స్వచ్ఛమైన ముసల్మానుడికి ఈ సందేశాన్ని అందించడం జరిగింది. అనగా కర్మల ఆధారముగా అందరి కంటే అధికముగా నష్టపడు వారి వార్తను మేము మీకు తెలుపవలెనా? అని అడుగుము. వారి ప్రయత్నములన్నియు ప్రపంచ జీవిత కోరికలో మాయమైనవి. వారు ప్రారిశ్రామిక రంగములో నైపుణ్యమును చూపుచున్నారని వారు భావింతురు. తమ ప్రభువు సంకేతములను, అతని కలయికను నిరాకరించిన వారు వీరే. కనుక వారి కర్మలు వ్యర్థమయ్యెను. పునరుత్థాన దినము మేము వారికెట్టి ప్రాధన్యత నివ్వము.

ఈ సూక్తులలో అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. ఇలాంటి దాంబికులు మరియు నాస్తికులు, శాస్త్రవేత్తలు వివిధ రకాల ఆవిష్కరణలు చేసినవారు తమ తమ ఆవిష్కరణల వలన, పరిశోధనల వలన ఎంతటి అహంకారానికి గురైనారు అనగా వారే తమను సర్వంగా భావించుకోసాగారు. కాని అల్లాహ్ తాలా మాత్రం అలాంటి వారికి ప్రళయదినమున ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వబడదని స్పష్టముగా తెల్పుచున్నాడు. ఎందుకనగా వారు ఈ పరిశోధనలన్నింటిని మరియు ఆవిష్కరణలను అల్లాహ్ తాలా అనుగ్రహించిన సామర్థ్యముల మేరకు చేశారు. ఈ ఆవిష్కరణలు, పరిశోధనలు వారి దృష్టిని అల్లాహ్ తాలా వైపు మరల్చుటకు బదులుగా వారిలో అహంకారాన్ని, గర్వాన్ని కల్గింపజేశాయి. ఈ అహంకార పూరిత మానవులకు అందుకు తగిన శిక్ష విధించబడును.

ఇందుకు భిన్నముగా చూసినచో అల్లాహ్ తాలా యొక్క విశ్వాస దాసులు ఎప్పుడు ఏ విధమైన ఆవిష్కరణలు చేసిన వారు ముందుగా అల్లాహ్ తాలాకు కృతజ్ఞతలు తెల్పుతుంటారు. చాలా మంది ముసల్మాను శాస్త్రవేత్తలు ఉదా॥ అల్ హమ్‌యారి, ఇబ్రాహీం అల్ఫజారి ,జాబిర్ బిన్ హయాన్, ముహమ్మద్ అల్ఫజారి, యాకూబ్ బిన్ తారీఖ్, అల్ ఖవారజమి, అబ్దుర్రహ్మాన్ అస్సూఫీ, ఇబ్నుల్ హైషూమ్, అల్ బేరూని, ఇబ్నే సీనా, అబ్దుర్రహ్మాన్ అల్ ఖజీని మరియు ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుస్సలాం వంటి శాస్త్రవేత్తలు ఉన్నారు. వీరందరు అల్లాహ్ తాలా వారికి అనుగ్రహించిన విజ్ఞానం ద్వారా చాలా అవిష్కరణలు చేశారు అనేక ఆవిష్కరణలకు పునాదులు వేశారు. వారు అన్ని రంగాలలో మార్గదర్శకత్వం కోసం సూత్రాలు మరియు చట్టాలను కనుగొన్నారు. వాటి ఆధారంగానే యూరోపియన్ శాస్త్రవేత్తలు మరింత పురోగతి సాధించారు.

ప్రియమైన శ్రోతలారా, మీరువిన్నట్లుగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దువా ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

ఉనికిని విశ్వసించడం వల్ల కలిగే ప్రయోజనాలు మరియు ఆశీర్వాదాలు ఏమిటో కూడా ఈప్రసంగంలో వివరించడం నా ఉద్దేశం. ఈ క్రమంలో అల్లాహ్ తాలాయే స్వయముగా ఈ విధముగా తెల్పుచున్నాడు.

**వ ఇన్ త ఉద్దూ నిఅమత అల్లాహి లా తుహ్సూహా** (ఇబ్రాహీం: 35) అనగా మీరు అల్లాహ్ ఇచ్చిన ఆశీర్వాదాలు మరియు అనుగ్రహములను లెక్కించాలనుకుంటే, మీరు ఎప్పటికీ చేయలేరు.

వాస్తవంఏమిటంటే, ఒక వ్యక్తి అల్లాహు ను విశ్వసించడం వల్ల కలిగే ప్రయోజనాలను మరియు ఆశీర్వాదాలను లెక్కించాలనుకుంటే, ఏ వ్యక్తికి కూడ లెక్కించే స్థోమత లేదు.

ఈ కొద్ది సమయంలో కొన్ని ఆశీర్వాదాలను గూర్చి వివరిస్తాను. సర్వ శక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఉనికిపై విశ్వాసం మరియు నమ్మకం ఉన్న వ్యక్తి మరియు అతని సూచనల ప్రకారం తన జీవితాన్ని గడిపే వ్యక్తి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తెల్పినట్లుగా అతను మనస్సులో శాంతిని మరియు సంతృప్తిని అనుభవిస్తాడు. ఈ విషయాన్నే అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. **అల్లజీన ఆమనూ వ తత్మ ఇన్ను ఖులూబుహుం బిజిక్‌రిల్లాహి అలా బిజిక్‌రిల్లాహి తత్మ ఇన్నుల్ ఖులూబ్** (అర్రాద్:29) అనగా విశ్వసించిన వారి , హృదయాలు అల్లాహ్ స్మరణతో సంతృప్తి చెందుతాయి, వినండి!. హృదయాలు అల్లాహ్ స్మరణతోనే సంతృప్తి చెందుతాయి మరియు వారు అల్లాహ్ యొక్క ప్రతి అభిష్టానికి సంతృప్తి చెందుతారు. మరియు ఇది వారి జీవితానికి ఆదర్శవంతమైన దృక్పథం అవుతుంది.

ఓప్రభూ! నీఅనుగ్రహమైనా, లేక నీ పరీక్ష అయినా
నీ సంతోషమే మా సంతోషంగా ఉంటాము.

వారి ప్రభువు వారితోసంతృప్తి చెందాలనే ఉద్దేశంతోనే వారి శోధన మరియు కృషి ఉంటుంది. వారు కూడా చాలా ఓర్పుతో కష్టాలను మరియు బాధలను సహిస్తారు. వారి ఉదాహరణ ఒక రాజు మరియు అతని సేవకుడిని పోలి ఉంటుంది. ఆ ఉదాహరణలో ఇలా చెప్పుకోవడం జరుగుతుంది. పురాతన కాలంలో ఒకరాజు వద్దకు పుచ్చకాయల బుట్టను తీసుకు వచ్చారని చెబుతారు. రాజు అనుకున్నాడు. నా సేవకుడు ఇంతవరకు నాకు చాలా సేవలు చేశాడు. ఈరోజు నేను అతనికి సేవ చేస్తాను. కావున ఆ రాజు పుచ్చకాయను కోసి తన సేవకులలో ఒకరికి ఇచ్చాడు, సేవకుడు దానిని తిన్నాడు. రాజు ఆ ముక్క రుచిగా ఉందా అని అడిగాడు. అందుకు సేవకుడు ఇలా సమాధానం ఇచ్చాడు. "చాలా బాగుంది." అలా ఆ రాజు గారు పుచ్చకాయలు కోసి సేవకునికి ఇస్తూ వచ్చాడు. ఆ సేవకుడు తింటూ ఉన్నాడు. చివరిగా రాజు గారు ఒక పుచ్చకాయ ముక్కను తినగా అది చాలా చేదుగా ఉంది. ఆ రాజు గారు సేవకున్ని పిలిచి ఇలా అడిగారు నేను పుచ్చకాయ తినగా అది చాలా చేదుగా ఉంది కానీ మీరు మాత్రం దానిని చాలా ఆనందంగా తిన్నారు. పైగా నేను అడిగినప్పుడు, చాలా బాగుంది' అని మీరు చెప్పారు." ఎందుకు అలా చేసారు?. అందుకు సేవకుడు ఇలా సమాధానం ఇచ్చాడు. "రాజు మీచేతి నుండి నాకు చాలా తీపి పదార్థాలు తినిపించారు. అలాంటప్పుడు ఈ రోజు ఆ చేత్తో ఒక్క చేదు పుచ్చకాయ తినవలసి వస్తే అది బాగాలేదని ఎందుకు చెప్పాలి?. అసలైన రుచి నాకు తినిపించే ఆచేతిలో ఉంది.

ఈ ఉదాహరణతో అర్థం చేసుకోవచ్చును. ఒక విశ్వాసి జీవితంలో అల్లాహ్ తాలా వైపు నుండి ఏదైన ఇబ్బంది వచ్చినట్లయితే, అతను దానిని ఓర్పుతో మరియు సహనంతో భరిస్తాడు. మరియు అతను నమ్మకం, విశ్వాసం పెంచుకున్న అల్లాహ్‌నే ఆ ఇబ్బందిని దూరం చేయమని దుఆలు చేస్తాడు. అంతేగాకా తన దైవం ఆ ఇబ్బందిని దూరం చేసిన తరువాత అసంఖ్యాకమైన అనుగ్రహాలను కురిపిస్తాడని ఆశిస్తాడు. ఎందుకనగా అల్లాహ్ ఈ విధముగా వాగ్దానం చేశాడు. **ఇన్న మఅల్ ఉస్‌రి యుస్‌రా (సూరాఅన్షరాహ్: 06)**

మరోవైపు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఉనికిని విశ్వసించని కపటుడు మరియు నాస్తికుడు బాధలతో, కష్టాలతో, మరియు వ్యాధులతో తీవ్రంగా బాధపడుతుంటాడు. అతనికి సంతృప్తి మరియు శాంతి లభించదు. అతను రాత్రి నిద్రపోడు. శాంతి మరియు నిద్ర కోసం వారు మత్తు మరియు మాదక ద్రవ్యాలను ఉపయోగిస్తుంటారు. మరియు వారిలో కొందరు ఆత్మ హత్యలకు పాల్పడతారు. మరి కొందరు వారి మానసిక సమతుల్యతను కోల్పోతారు. ఎందుకంటే వారికి సంతృప్తి మరియు మనశ్శాంతి లభించు ఆధారం దొరకదు. నిరాశ నిస్పృహలతో మరణిస్తారు. **ఫఅతబిర్ యా ఉలిల్ అల్ బాబ్.**

రెండవ ప్రయోజనం: శ్రోతలారా! మరో విశేషం ఏమిటంటే, ప్రపంచంలో రెండు రకాల పిల్లలు ఉన్నారు. ఒకరు తల్లిదండ్రుల ప్రేమాప్యాయతలు ఉన్నవారు, మరొకరు అనాథలు. తల్లిదండ్రుల ప్రేమాప్యాయతలు ఉన్నవారు, వారికి ఏ అవసరం వచ్చిన తమ తల్లిదండ్రుల సన్నిధికి చేరుతారు. దయగల తండ్రి వారి ప్రతి అవసరాన్ని తీర్చుటకు ప్రయత్నిస్తాడు. కానీ తండ్రి లేని వారు తమకు అవసరం వచ్చినప్పుడు నిరాశ నిశృహలకు గురి అవుతుంటారు.

విశ్వాసులైన దాసులు మరియు అల్లాహ్ ఉనికిని తిరస్కరించే వారి ఉదాహరణలు కూడ పై విధముగానే ఉంటాయి. అల్లాహ్ తాలాను విశ్వసించువారు తమ సంరక్షకుడిపై మరియు తన దేవునిపై పూర్తి నమ్మకాన్ని కల్గియుంటారు. వారి విశ్వాసం అల్లాహ్ తాలా యొక్క ఈ వాగ్దానమును అనుసరించి ఉంటుంది.

**వఖాల రబ్బుకుం ఉద్ఊని అస్తజిబ్‌లకుం** (ముమిన్:61)

అనగా మీరు నన్ను పిలవండి. నేను మీ విన్నపాలను వింటాను.

మరల ఇలా తెలిపాడు. **వ ఇజా సఅలక ఇబాది అన్ని ఫ ఇన్ని ఖరీబున్ ఉజీబు దఅవత ద్దాఇ ఇజా ద ఆని ఫల్‌యస్తజీబూలీ వల్ యూమినూ బీ లఅల్లహుం యర్‌షుదూన్** (బఖర: 187) నా దాసులు నా గురించి నిన్ను అడిగినప్పుడు, నేను ఖచ్చితంగా సమీపంలోనే ఉన్నాను. అతను నన్ను పిలిచే అభ్యర్థి యొక్క ప్రార్థనకు నేను సమాధానం ఇస్తాను. అతను చేయవలసింది కేవలం నా ఆదేశాలను పాటించడం, నన్ను విశ్వసించడం. ఫలితముగా వారు మార నిర్దేశం చేయబడుతారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా తెలిపారు.

**సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌పై విశ్వాసం పెంచుకున్న వ్యక్తిస్వయంగా అల్లాహ్ రక్షణలోఉన్నట్లు భావిస్తాడు.**

అల్లాహ్ తాలా ఉనికిని విశ్వసించే వ్యక్తికి లభించే ఒక ప్రయోజనం మరియు ఆశీర్వాదం ఏమిటంటే, అతను ప్రతి ఆపద సమయంలో అల్లాహ్ తాలా యొక్క రక్షణలో ఉన్నాను అని విశ్వసిస్తాడు మరియు అతనికి అల్లాహ్ తాలా యొక్క ఈ వాగ్దానంపై విశ్వాసం కలిగి ఉంటాడు. అనగా **ఫలా ఖౌఫున్ అలైహిం వలా హుం యహ్జనూన్** (బఖర:39) వారికి భయం ఉండదు, దుఃఖం ఉండదు.

ఈ క్రమంలోనే సయ్యద్నా హజ్రత్ ముహమ్మదు ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం మరియు వారి సహచరలు రిజ్వానుల్లాహి అజ్మాయీన్‌ల చరిత్రలలో, ఈవిషయంలో విశ్వాసం కలిగించే అనేక సంఘటనలు ప్రస్తావించబడ్డాయి. వాటిలో ఒక దానిని హజ్రత్ జాబిర్ (ర.అ) ఇలా వివరించారు.

క్రీ.శ.628, హిజ్రీ7వసంవత్సరంలో, దైవప్రవక్త (స) జాతిర్రిఖఅ యుద్ధానికి వెళ్ళారు. హుజూర్ సల్లల్లాహ్ అలైహి వసల్లం సహచరులతో కలిసి తిరిగి వస్తున్న సమయంలో మార్గ మధ్యలో ఒక చెట్టు క్రింద సేదతీర్చుకోవడం కోసం కూర్చున్నారు. హుజూర్ (స) ఖడ్గమును ఒక మరొక చెట్టుకు వ్రేలాదిసారు. హజ్రత్ జాబిర్ (ర) వివరిస్తున్నారు, మేము కూడా నిద్రలోకి జారుకున్నము. అప్పుడు ఒక్కసారిగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వరం వినిపించింది. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం మమ్ములను పిలుస్తున్నారు. మేము ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వెళ్ళినప్పుడు అక్కడ ఒకశత్రువు నిలబడి ఉన్నాడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఇలా తెలియ జేశారు. నేను నిద్రపోయినప్పుడు ఈశత్రువు నన్ను నిద్ర నుండి మేల్కొపాడు. ఆ సమయంలో నా

**అహ్‌దీస్ బోధనలు**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజులుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671)

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

**అహ్‌దీస్ బోధనలు**

**"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Mahboobnagar, (Telangana)***

ఖడ్గము అతని చేతిలో ఉన్నది. అతడు నాతో నా నుండి నిన్ను ఎవరు కాపాడుతారు? అని అడిగాడు. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం "అల్లాహ్ – అల్లాహ్ – అల్లాహ్ " అని సమాధానం ఇచ్చారు. అప్పుడు ఆ ఖడ్గము ఆ శత్రువు చేతిలో నుండి క్రింద పడిపోయింది. అతడు ఏమి చేయలేక పోయాడు. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ ఖడ్గమును తీసుకున్నారు. ఆపై ఆ శత్రువును ఇప్పుడు నిన్ను నా నుండి ఎవరు కాపాడుతారు? అని అడిగారు. అప్పుడు ఆ శత్రువు మీరే నన్ను క్షమించాలి అని సమాధానం ఇచ్చాడు." (బుఖారి కితాబుల్ మఘాజి, బాబు ఘజవతు జాతిర్రికాఇ)

శ్రోతలారా, దైవప్రవక్త (స) తన అల్లాహ్‌పై పూర్తి విశ్వాసంను కలిగి ఉన్నారు. ఆ అల్లాహ్‌యే హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఆ శత్రువు యొక్క కీడు నుండి రక్షించాడు. అందుకు భిన్నముగా చూసినచో ఆ శత్రువుకు ఏకేశ్వరుడైన అల్లాహ్‌పై విశ్వాసం లేకుండెను. అందుకే అతడు ఎలాంటి రక్షకుడిని పొందలేదు. తన మోక్షం కోసం హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంను అభ్యర్థించుకున్నాడు. ఈ ఘటన ద్వారా తెలియునదేమనగా, హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి జీవిన విధానంనకు అనుగుణముగా అనుసరిస్తూ ఏ విశ్వాసుడైతే అల్లాహ్‌పై పూర్తి విశ్వాసాన్ని కల్గియుంటాడో అతడిని అల్లాహ్ తాలా అన్ని రకాల ఆపదల నుండి కాపాడుతాడు.

అదే విధముగా మరొక ఘటనను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి జీవిత చరిత్ర నుండి మీ ముందు ప్రస్తావించుతాను.

1904 మరియు 1905వ సం။లో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు కరందీన్ వ్యాజ్యము విషయంలో గుర్దాస్‌పూర్‌లో ఉన్నారు. ఒక అనుచరుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సన్నిధికి వచ్చి న్యాయమూర్తి మిమ్ములను శిక్షించి, జైలులో బంధించాలనే నిర్ణయంతో ఉన్నాడు. ఈ వ్యాజ్యములో మీరే అతని బలి అని కూడ అతడు భావిస్తున్నాడు అని తెలిపారు. అనుచరుడు మరల ఇలా తెలిపారు. ఎప్పుడైతే నేను బలి అనే పదాన్ని పలికానో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పడుకున్న చోట నుండి ఒక్కసారిగా లేచి కూర్చున్నారు. ఆపై ఇలా అన్నారు. నేను బలిని కాదు. నేను సింహాన్ని. అది కూడ సాధారణ సింహాన్ని కాదు, అల్లాహ్ యొక్క సింహాన్ని. దేవుని సింహంపై చేయి వేసేంత ధైర్యం ఉన్నదా? అని అన్నారు.

**(సీరతుల్ మహ్దీ, భాగం 1, పేజి 87, కథనము 107)**

మరల ఇలా తెలిపారు.

దైవజనులకు సవాలు విసరం అంత మంచిది కాదు.

సింహంపై చేయి వేయకు ఓ ఏడుపుగొట్టువాడా!

సయ్యదినా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి తమ అల్లాహ్ సంరక్షణపై పూర్తి నమ్మకం, విశ్వాసం ఉన్నది. వారి నిష్ఠాపరతయే వారిని ఎల్లవేళలా కాపాడుతుంది. ఈ నడవడికనే ప్రతి అహ్మదీయుడు అనుసరిస్తూ అల్లాహ్‌పై పూర్తి నమ్మకాన్ని పెంచుకోవాలి. అలాంటివారినే అల్లాహ్ తాలా కాపాడుతాడు. ఇందుకు భిన్నముగా చూసినచో అల్లాహ్ తాలా ఉనికినే వ్యతిరేకించేవారు ఇలాంటి పరిస్థితులలో తమను తాము ఒంటిరి వారిగా, ఏకాకిగా, నిస్సహాయులుగా మిగిలి పోతారు.

**నేరాలకు పాల్పడకుండా దూరంగా ఉండడం.**

నేరాలను నిరోధించడానికి ప్రభుత్వాలు చట్టాలు చేస్తాయి, కానీ నేరాలను నిరోధించడంలో అవి పూర్తిగా విజయవంతం కావు, కానీ సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను విశ్వసించే వ్యక్తులు మరియు సమాజం అతని ఆదేశాలను మరియు ఏదైనా ఆదేశాన్ని పాటించడం తమ కర్తవ్యంగా భావించేవారు ఏ చిన్న ఆదేశమునైన పాటించకపోవడాన్ని పాపంగా భావిస్తారు. మరియు వారి అసలైన యజమాని ఎక్కడ కోపగించుకుంటాడో అని వారు భయపడతారు. అంతేగాకా వారు ఏదైన తప్పు చేసినచో చట్టం తమపై చట్ట పరమైన చర్య తీసుకున్నా? లేదా? సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అట్టి తప్పుకు తప్పకుండా చర్యతీసుకుంటాడని వారు నమ్ముతారు. కాబట్టి వారు ప్రతి చిన్న చిన్న తప్పులు కూడ జరుగకుండా జాగ్రతలు తీసుకుంటారు.

సయ్యదినా హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో అరబ్బులు మద్యపానం చేసేవారు, మరియు కొన్ని తెగలలో, మద్యం సేవించడానికి ఐదు ప్రత్యేక సమయాలను నియమించుకున్నారు. ఎక్కువ మద్యపానం చేయడం ఒకగొప్ప తనంగా భావించేవారు. తమ కవితలలో ఈవిషయాలను చాలా గర్వంగా ప్రస్తావించేవారు. కాని అల్లాహ్ తాలా ఎప్పుడైతే మద్య పానాన్ని నిషేధించినాడో, వెంటనే దానిని విడిచిపెట్టారు.

హజ్రత్ అనస్ రజి ఇలా తెలిపారు: ఒకరోజు మదీనాలో కొంతమంది సహచరులు అబూతల్హా ఇంట్లో మద్యం తాగుతున్నారు. నేను వారికి మద్యం అందిస్తున్నాను. ఇంతలో వీదిలో నుండి ఎవరో ఒక వ్యక్తి ఇలా ప్రకటన చేస్తూ వెళ్ళుతున్నాడు. నేటి నుండి మద్యపానం పూర్తిగా నిషేధించబడిందని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంపై దైవవాణి అవతరించింది. మద్యం త్రాగేవారిలో ఒకరు ముందుగా ఎవరైన వెళ్ళి ఈ ప్రకటన నిజమైనదా? కాదా? తెలుసుకోని రండి అని అన్నాడు. కాని మరి కొందరు మాత్రం అలా ముందుగా మద్యపానపు కుండలను, పాత్రలను పగలగొట్టండి, మద్యం మొత్తాన్ని పారబోయండి. ఆ తరువాత ప్రకటన నిజమా? కాదా? తెలుసుకోని రండి అని అన్నారు. ఆ తరువాత నిజం తెలుసుకోగా మద్యపానం నిషేదించబడిందని తెలిపోయింది. కావున ఆ నాటి నుండి వారు పూర్తిగా మద్యపానాన్ని వదిలివేశారు. ఏ ఒక్కరు కూడ ఆ ఆలోచనను తరువాత కాలంలో ఎన్నడుకూడ మనస్సులోకి రానివ్వలేదు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు తమ ఒక పద్యపు పంక్తిలో అనుచరులు రిజ్వానుల్లాహి అజ్మయీన్‌ల విశిష్టతను తెల్పుచూ ఇలా పేర్కొన్నారు.

**తరకూ అల్ ఘబూ్ఖ వ బదలూ మిన్ జౌఖిహి**

**జౌఖ దుఆఇ బిలైలతిల్ హుజ్నీ**

అనగా వారు మద్యపానియాన్ని విడిచిపెట్టినారు, దుఃఖపు రాత్రులలో ప్రార్థన యొక్క ఆనందంతో దాని ఆనందాన్ని భర్తీ చేశారు.

శ్రోతలారా!

అల్లాహ్‌ను విశ్వసించేవారికి లభించే చాలా గొప్ప ప్రయోజనం మరియు శుభము ఏమిటనగా, వారు తక్షణమే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆజ్ఞను అనుసరిస్తారు. మరియు చెడుల నుండి, పాపాలు మరియు నేరాల నుండి దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తారు. కాని అన్యులు ఇలాంటి ప్రయోజనాలు మరియు ఆశీర్వాదాలను కోల్పోతారు.

**నిజాయితి పరులు.**

సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను విశ్వసించేవారు నిజాయితీపరులు మరియు సత్యవంతులుగా ఉంటారు. అందుకు భిన్నముగా చూసినచో ఒక నాస్తికునికి మరియు కపటుడుకి సత్యం మరియు అబద్ధాల గురించి ఎలాంటి పట్టింపు ఉండదు. అల్లహ్‌ను విశ్వసించు వారు ఎలాంటి కష్టము వచ్చినా ఏ ఆపద ఎదురైనా సత్యం పలకడాన్ని వదిలి వేయరు. ఎందుకనగా వారి ముందు వారి అల్లాహ్ యొక్క ఈ ఆదేశం **వఖూనూ మఅ స్సాదిఖీన్** (తౌబహ్:119) కదలాడుతూ ఉంటుంది. అనగా సత్యవంతుల సమూహంలో చేరండి, ఎట్టి పరిస్థితుల్లోనూ నీతిమంతుల వర్గాన్ని విడిచిపెట్టడానికి ఇష్టపడకూడదు అని చెప్పబడింది.

ఈసందర్భంలో, హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జీలాని రహ్మతుల్లాఅలైహి గారి ఒక సంఘటన చరిత్రలో ఈ విధముగా ప్రస్తావించబడింది. వారు విద్యను అభ్యసించడం కోసం ఇంటి నుండి బయలు దేరుతున్నప్పుడు. వారి తల్లి అతని కోటు జేబులో 80 అష్రఫియాలను దాచి కుట్టు వేసింది. ఆపై ఆ తల్లి తన కొడుకుకు ఎప్పుడూ అబద్ధం చెప్పకూడదు అని హితబోధ చేసింది. షేక్ అబ్దుల్ ఖాదిర్ రహ్మ గారు ఇంటి నుండి బయలుదేరినారు. ఒక అడవి మార్గం ద్వారా

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | "అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్లె ఆందోళన కూడ దూరం కాదు. " (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018) |
| --- | --- |

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*




EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 10. Thursday, 13 NOV 2025, Issue No - 46

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

వెళ్ళుతున్నారు. దొంగలు మరియు బందిపోట్లు వారిని పట్టుకుని నీ వద్ద ఏమైన నగదు ఉన్నదా? అని అడిగారు. అందుకు షేక్ అబ్దుల్ ఖాదిర్ రహ్మ గారు నా వద్ద 80 అష్రాఫియాన్‌లు ఉన్నాయని, వాటిని వారి తల్లి జేబ్‌లో దాచి కుట్టు వేసింది అని, ఆపై ఎన్నడు అబద్ధము ఆడకుము, అబద్ధమాడినచో అల్లాహ్‌కు కోపం వచ్చునని హితబోధ చేసిందని బదులిచ్చారు. అప్పుడు ఆ జేబును విప్పి చూడగా అందులో 80 అష్రఫీలు ఉన్నాయి. దొంగల నాయకుడు ఇలా అన్నాడు. మా తల్లిదండ్రులు , మా పెద్దవారు అల్లాహ్ ఆదేశం ప్రకారం మాకు కూడ నిజమే పలకాలని హితబోధ చేశారు. కాని మేము ఆ హితబోధను పాటించలేదు. అందుకే మేము ఈ అడవులలో తిరుగుతున్నాము. ఆ వెంటనే ఆ దొంగల నాయకుడు పాశ్చాత్తాపం చెంది, ఇకపై ఎన్నడు కూడ అసత్యం పలుకను, ఎల్లప్పుడు సత్యమే పలుకుతాను అని వాగ్దానం చేశాడు. మరల ఇలా తెల్పడం జరుగుతుంది. ఆ దొంగయే హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (రహ్మ) గారికి మొదటి శిష్యుడిగా మారిపోయాడు.

ప్రియమైన శ్రోతలారా, తప్పుదారిపట్టిన వారు మరియు నేరస్థులు కూడా అల్లాహ్ ఉన్నాడని నమ్మి, అతనికి అవిధేయత చూపడం వల్ల అల్లాహ్‌కు కోపం వస్తుందని, అతడు అయిష్టపడుతాడనే నమ్మకం కల్గినచో వారు కూడ సత్యపు మరియు నిజాయితితో కూడిన మార్గమును ఎంచుకుంటారు అనే వాస్తవం ఈ ఘటన ద్వారా తెలుస్తుంది. కాని ఎవరికైతే అల్లాహ్‌పై నమ్మకం, విశ్వాసమే ఉండదో వారు అబద్ధాలు, మోసం, లంచం మరియు పాపాల బురద నుండి బయట పడలేరు.

ఇలాంటి మరొక విశ్వాసపు ఘటనయే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి జీవితపు చరిత్రలో మనకు లభిస్తుంది. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ అన్‌హు గారు తమ పుస్తకం " అహ్మదియ్యత్ అనగా నిజమైన ఇస్లాం "లో ఈ విధముగా వ్రాసారు:

ఒకసారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంపై తంతితపాల శాఖ వారి ద్వారా ఒక వ్యాజ్యమును మోపడం జరిగింది. ఆ వ్యాజ్యములో నేరము రుజువైనచో జరిమానాతో పాటు జైలుశిక్ష రెండూ విధించబడతాయి. ఆరోజుల్లో పోస్టాఫీసు నిబంధనల ఉల్లంఘన తరచుగా జరిగేది. కావున ప్రజలను కఠినంగా శిక్షించినచో అప్పుడు ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటారు అని తపాల శాఖవారు భావవించేవారు. అందువలనే ఈ తపాల వ్యాజ్యము విషయంలో కూడా ఆంగ్లేయ అధికారియే స్వయముగా న్యాయస్థానానికి వచ్చి హుజూర్ (అ)కు తప్పకుండా శిక్షను విధించేలా చూడాలని వ్యాజ్యాన్ని అనుసరించేవాడు. ఈ వ్యాజ్యములో సాక్షిగా ఎవరైతే హుజూర్ (అ) ప్యాకెట్‌ను విప్పిచూశాడో అతడినే ప్రవేశపెట్టవలసి ఉ ండెను. ఆ ప్యాకెట్‌లో ఒక లేఖ ఉన్నది. అలా ప్యాకెట్‌లో లేఖ వ్రాసి పంపడం తపాల చట్టపరంగా నేరంగా భావించబడును. న్యాయవాదులు హుజూర్ (అ)కు ఈ కేసు నుండి బయట పడాలంటే నేను ఆ లేఖను వేరుగా పంపాను అని చెప్పండి, ఎవరికైతే ప్యాకెట్ పంపడం జరిగిందో అతడు ఫాద్రి కావున అతడు హుజూర్ (అ) వాగ్వివాదం చేశాడు కావున, ఒక రకముగా అతడు శత్రుత్వాన్ని కల్గియున్నాడు అందుకే ఇలా చేసి ఉండవచ్చును అని చెప్పినచో ఈ కారణంను తప్పకుండా స్వీకరించబడుతుంది అని సలహా ఇచ్చారు. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ సలహాను పూర్తిగా వ్యతిరేకించారు. ఆపై ఇలా అన్నారు. నేను ఎలా అబద్ధం చెప్పగలను?. నేనే స్వయముగా ఆ లేఖను ఆ ప్యాకెట్‌లో పంపాను. ఆ ప్యాకెట్‌లో ఉన్న ఆంశానికి చెందిన లేఖయే కదా! అని నేను అలా పంపాను. ఈ సత్యం న్యాయమూర్తిపై ఎంతటి ప్రభావాన్ని చూపిందనగా, తపాల అధికారి పదే పదే అభ్యర్థించిన కూడనా న్యాయమూర్తి హుజూర్ (అ)ను నిరపరాధిగా పేర్కొన్నారు. ఆపై ఇలా అన్నాడు. శిక్ష పడుతుందని తెలిసినప్పుడు ఈ వ్యక్తి తన నోటితో ఒక అబద్ధమును పలికి తనను తాను కాపాడుకోవచ్చును. కాని ఈ వ్యక్తి శిక్షకు ఏ మాత్రం భయపడకుండా అబద్ధమును పలుకకుండా నిజాన్నే తెలిపాడు. అలాంటప్పుడు నేను వారికి అస్సలు శిక్ష విధించను" అని అన్నాడు.

**(అహ్మదియ్యత్ అనగా నిజమైన ఇస్లాం, అన్వారుల్ ఉలూమ్, సంపుటటి 8, పేజి 206)**

శ్రోతలారా!, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అల్లాహ్‌పై ఉ న్నటు వంటి సంపూర్ణ విశ్వాసం యొక్క ఆశీర్వాదం వలన తప్పుడు సాక్ష్యం మరియు అబద్ధాల నుండి ఎల్లప్పుడు దూరంగా ఉండేవారు అని ఈసంఘటన ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. అయితే న్యాయనిపుణులు తప్పుడు సలహాలు ఇచ్చారు. అయినా కూడ హుజూర్ అలైహిస్సలాం ఎల్లప్పుడూ దైవిక మరియు జాతీయచట్టాన్ని అనుసరిస్తూనే వచ్చారు. కాబట్టి అల్లాహ్‌ను విశ్వసించడం వల్లకలిగే మరొక ప్రయోజనం ఏమిటనగా,నా వ్యక్తి తన దేశ చట్టానికి కట్టుబడి ఉంటాడు మరియు దానిని ఉ ల్లంఘించకుండా ఉండటమే సర్వాధికారి అయినా అల్లాహ్ ఆదేశమని భావిస్తాడు.

అల్లాహ్ తాలా మనందరికి విశ్వాసం మరియు నమ్మకంను పెంచుకొను భాగ్యాన్ని కల్పించుగాకా! మరియు నీతి నిజాయితిలతో జీవించు భాగ్యాన్ని కల్పించుగాకా! ఆమీన్.

---

**హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలామ్ ఇలా తెల్పినారు;-**
"ధర్మంలో రెండే భాగాలు కలవు. ఒకటి దేవుణ్ణి ప్రేమించడం. మరొకటి మానవాళిని ఎంతగా ప్రేమించాలంటే, వారి బాధలను మీవిగా భావించి, వారి కోసం దుఆలు చెయ్యాలి."

(నసీమ్ దావత్, రూహానీ ఖజాయిన్, సంపుటి;19, పేజీ; 464)

హుజూర్ అలైహిస్సలామ్ ఇంకా ఇలా తెల్పినారు;- "సానుభూతి మూడు రకాలుగా ఉంటుందని గుర్తుంచుకోండి! మొదటిది, భౌతికమైంది, రెండంది ఆర్థికమైంది, మూడవది దుఆల పరమైనది. దీని (దుఆ)లో దబ్బును ఖర్చుపెట్టవలసిన అవసరం ఉండదు. బలప్రయోగం చెయ్యవలసిన అవసరం అంతకంటే ఉండదు. పైగా దీని అనుగ్రహాలు చాలా విశాలమైనవి. ఎందుకంటే, భౌతిక సానుభూతి అతనిలో శక్తి, సామర్థ్యాలు ఉన్నప్పుడు మాత్రమే చూపించగలడు. ఉదా॥ ఒక బలహీన, నిస్సహాయ పేదవాడు ఒకచోట క్రిందపడి కొట్టుమిట్టాడుతున్నచో, శక్తి, సామర్థ్యాలులేని మరో వ్యక్తి అతన్ని పైకి లేపడానికి ఎలా సహాయం చెయ్యగలడు?. అదే విధంగా ఒక వ్యక్తి పేదరికం, నిరాధారుడు, నిస్సహాయుడు ఆకలితో అలమటిస్తుంటే, ధనము లేకుండా అతని పట్ల ఏలా సానుభూతి చూపగలడు. కాని దుఆతో చూపే సానుభూతి ఎంత గొప్పదంటే దీనికి ధనం, శక్తిసామర్థ్యాలు అవసరంలేదు. వాస్తవంగా మానవుడు, మానవునిగి ఉన్నంత వరకు అతడు ఇతరుల కోసం దుఆలు చేస్తూ, ప్రయోజనాన్ని కలిగించవచ్చు. ఈ సానుభూతి యొక్క అనుగ్రహాలు చాలా విశాలమైనవి. ఒక వేళ మానవుడు ఈ సానుభూతిని ఉ పయోగించుకోకపోతే ఆతడు చాలా దురదృష్టవంతుడని భావించండి."

(మల్ఫూజాత్, సంపుటి; 1, పేజీ; 352,353)

వారు (అ.స) ఇలా తెల్పినారు;- "సామాన్య సానుభూతిని బోధించని ధర్మము, ధర్మం కాదు. మరియు సానుభూతి గుణం లేని మానవుడు, మానవుడు కాదు. మన దైవం ఏ జాతి పట్ల వివక్ష చూపలేదు."

(రూహానీ ఖజాయీన్, సంపుటి; 23, పేజీ; 439)

మరో చోట ఇలా తెల్పినారు;- "నాకు సంబంధిచిన వారు గుర్తుంచుకోండి! ఏ ధర్మం వారనే దానితో సంబంధం లేకుండా మీరు ప్రతి ఒక్కరి పై కరుణ చూపండి. మరియు ఏ తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరికి మేలు చెయ్యండి. ఎందుకంటే ఖురాన్ కరీమ్ బోధన ఇదే **"వయుత్ఇమూన త్తఆమ అలా హుబ్బిహి మిస్‌కీనన్ వయతీమన్ వఅసీరా"**. "మరియు అది వారికి ప్రీతికరమైనప్పటికీ, వారు నిరుపేదలకు, అనాథలకు మరియు ఖైదీలకు, ఆహారం పెడుతారు." ఖైదీలు వచ్చే బందీలందరూ అవిశ్వాసలే ఉండేవారు. ఇస్లాం కరుణ విశాలమైనది. నా అభిప్రాయం ప్రకారం సంపూర్ణ నైతిక బోధన కేవలం ఇస్లాంకే దక్కింది, ఇంకెవరికి దొరకలేదు."

(మల్ఫూజాత్, సం॥ 4, పేజీ; 219)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz